


జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజలకోసం
కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల -పెద్దపల్లి
బుధవారం 31-12-2025 పేజీలు : 12

# సమన్వయంతో సౌకర్యాలు కల్పించాలి

**మహా శివరాత్రి జాతర సమన్వయ సమావేశంలో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జాతర చైర్ పర్సన్ ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం**

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి డిసెంబర్ 30 (ప్రజా జ్యోతి ):** మహా శివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమెల్యే ఆది శ్రీనివాస్, జాతర చైర్ పర్సన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14, 15, 16 తేదీల్లో మహా శివరాత్రి జాతర నిర్వహించనున్న నేపథ్యంలో వేములవాడ లోని భీమేశ్వర సదన్ ఆవరణలో వివిధ శాఖల అధికారులతో జాతర సమన్వయ సమావేశాన్ని మంగళవారం జాతర ఛైర్మన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అద్యక్షతన నిర్వహించగా, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమెల్యే ఆది శ్రీనివాస్, ఎస్పీ మహేష్ బీ గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమెల్యే ఆది శ్రీనివాస్, జాతర ఛైర్మన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. భక్తులు భీమేశ్వర ఆలయంలో స్వామి వారి దర్శనాన్ని వేగంగా, సౌకర్యంగా చేసుకునేలా ఏర్పాట్లు ముమ్మరంగా చేయాలని వివరించారు. వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ నుంచి శ్రీ ఆలయం దాకా, వేములవాడ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే రోడ్లలో మరమ్మత్తులు, నిర్మాణాలు పక్కా ప్రణాళిక పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బస్ లు సిద్ధం చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. తిప్పాపూర్ ఆర్ టీ సీ బస్ స్టాండ్ లో తాగు నీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి దానికి ఒక అధికారిని నియమించాలని ఆదేశించారు.

మిగతా 10లో...

# అంజన్న సన్నిధికి జనసేనాని..

- పర్యాటన ఖరారు.... స్థల పరిశీలనలో అధికారులు
- టీటీడీ నిధులతో ఆలయ అభివృద్ధికి శంకుస్థాపన
- ఉత్కంఠ రేపుతున్న పాసుల చర్చ





**మల్యాల,డిసెంబర్ 31,ప్రజా జ్యోతి :** కొండగట్టు అంజన్న సన్నిధానానికి జనసేనని ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాకను అధికారులు అధికారింగా ఖరారు చేశారు. జనవరి 3వ తేదీన ఆయన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకోనున్నట్లు అధికారికంగా వెల్లడైంది. షెడ్యూల్ ప్రకారం జనవరి 3న ఉదయం హైదరాబాద్ బేగంపేట్ ఎయిర్పోర్ట్ నుండి 9.25 కు హెలికాప్టర్ ద్వారా బయలుదేరి కొండగట్టు జేఎన్టీయూ హెలిపాడ్‌కు 10.25 గంటలకు పవన్ కళ్యాణ్ చేరుకుంటారు. 10.30గంటలకు కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

మిగతా 11లో...



# జూలై 2026 వరకు కూనారం ఆర్.ఓ.బి నిర్మాణం పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- 4 నెలల కాలంలో జడ్పీ కార్యాలయం నిర్మాణం పూర్తి చేయాలి

మిగతా3లో...

# ఇల్లందకుంట మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడిగా ధార సురేష్

**మండల సర్పంచ్ లకు అందుబాటులో ఉంటా-సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు ధార సురేష్**



**జమ్మికుంట, డిసెంబర్30 ( ప్రజాజ్యోతి ):** ఇల్లందకుంట మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడిగా ఇల్లందకుంట సర్పంచ్ ధార సురేష్ ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలో 18 మంది సర్పంచ్ లు ఉండగా 10 మంది సర్పంచ్ లు ధార సురేష్ కి మద్దతు తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా మర్రి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా తోడేటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా బుస అశోక్, రేనుకుంట్ల శ్యామల, కోశాధికారిగా చింతం శ్రీలత, సభ్యులుగా రమణారెడ్డి, సంపత్, మాధవి, శ్రీనివాస్ లను ఎన్నుకున్నారు.. ఈ సందర్భంగా సర్పంచ్ సురేష్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో మండలంలోని సర్పంచులు తనకు మద్దతు తెలిపి ఏకగ్రీవంగా మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇల్లందకుంట మండలంలోని సర్పంచుల సమస్యల పై ఎప్పటికప్పుడు పోరాటం చేస్తానని, అందరికి అందుబాటులో ఉంటూ అండగా ఉంటానని ఐకమత్యంతో 5సంవత్సరాల ప్రజా పరిపాలన చేయుటకు ముందుకు వెళ్తామని అన్నారు.

## జనవరి 5, 6న వ్యాపార అవగహన వర్క్ షాప్ నిర్వహణ

**- జిల్లా పరిశ్రమల అధికారి ఏ. కీర్తికాంత్**

**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి,(,ప్రజాజ్యోతి), డిసెంబర్-30:-** జనవరి 5, 6న రోజులపాటు వ్యాపార అవగాహన వర్క్ షాప్ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని జిల్లా పరిశ్రమల అధికారి ఏ. కీర్తి కాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణలోని పెద్దపల్లిలో సూక్ష్మ ,చిన్న తరహా వ్యాపారుల కోసం %జశీఅటవసవతీఫ్ఐశీఅ శీట ×అఎఖుఆ ×అఎబర్‌తీఎ - సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ ఎంప్లాయిమెంట్ అండ్ లైవ్లీహుడ్ ఆధ్వర్యంలో జనవరి 5,6, 2026 తేదీలలో రెండు రోజుల పాటు వ్యాపార అవగాహన వర్క్ షాప్ ను నిర్వహిస్తున్నామని, వర్క్ షాప్ ద్వారా పెద్దపల్లి పరిసర ప్రాంతాల సూక్ష్మ, చిన్న వ్యాపారులను శక్తివంతం చేయడం లక్ష్యంగా లాభ-నష్ట నిర్వహణ, ప్రమాద మూల్యాంకనం, బ్యాలెన్స్ షీట్ విశ్లేషణ, విక్రయ వ్యూహాలు, నగదు ప్రవాహం మెరుగుదల, మార్కెటింగ్ వంటి అంశాలపై అవగాహన అందించబడుతుందని తెలిపారు.ఈ వర్క్ షాప్ లో పాల్గొనే వారికి పెద్దపల్లి ఎంట్రప్రెన్యూర్స్ డెవలప్మెంట్ ఫోరంలో సభ్యత్వం కూడా లభిస్తుందని,ఈ ఫోరం ద్వారా ఒక సంవత్సరం పాటు ఉచిత హ్యాండ్ హోల్డింగ్ సహాయం, నిరంతర సామర్థ్యాభివృద్ధి. మెంటార్ షిప్, మార్కెట్ అనుసంధానాలకు సౌలభ్యం కల్పించబడుతుందని, సూక్ష్మ, చిన్న వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ, ఆసక్తిగల వ్యాపారులు తమ ఎక్స్ ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ ను లింక్ నందు తమ వివరాలు నమోదు చేసుకోవాలనిజిల్లా పరిశ్రమల అధికారి ఏ. కీర్తి కాంత్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## 96 కోట్ల 85 లక్షల రూపాయల సన్న రకం వడ్ల బోనస్ సొమ్ము రైతుల ఖాతాలలో జమ

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**ఈ ఏడాది అదనంగా 58,697.459 క్వింటాళ్ళ ధాన్యం కొనుగోలు**

**333 కొనుగోలు కేంద్రాల ద్వారా 834 కోట్లతో, 3,49,118.400 క్వింటాళ్ళ దాన్యము కొనుగోలు పూర్తి**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి,( ప్రజా జ్యోతి), డిసెంబర్ -30:** పెద్దపల్లి జిల్లాలో సన్న రకం వడ్ల కు బోనస్ కింద ఇప్పటి వరకు 96 కోట్ల 85 లక్షల రూపాయలు చెల్లించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం ఖరీఫ్ - 2025-26 వరిధాన్యం కొనుగోళ్లలో బాగంగా పెద్దపల్లి జిల్లాలో 333 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా, డిసెంబర్ 29.12.2025 నాటికి 272 కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్ళు పూర్తి కావడం జరిగిందని తెలిపారు. మిగిలిన 43 కేంద్రాలలో ధాన్యం సేకరణ త్వరితగతిన పూర్తి కావడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ,ఇందులో బాగంగా, జిల్లాలో ఇప్పటివరకు 333 కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వ ఆదేశాల క్రమము కనీస మద్దతు ధర చెల్లించి, రూపాయలు 834 కోట్లతో, 3,49,118.400 క్వింటాళ్ళ దాన్యము కొనుగోలు చేయడం జరిగింది అన్నారు. ఖరీఫ్-2024-25 లో బాగంగా ఈ తేది నాటికి జిల్లాలో 2,90,420.941 క్వింటాళ్ళ దాన్యమును కొనుగోలు చేయగా, ఈ ఏడాది అదనంగా 58,697.459 క్వింటాళ్ళ ధాన్యం కొనుగోలు చేయడమైనది. ఈ కొనుగోలు చేసిన ధాన్యమును, కొనుగోలు కేంద్రాల నుండి ఎప్పటికప్పుడు రైస్ మిల్లర్లకు తరలించడం జరిగిందని తెలిపారు. నేటి వరకు ప్రభుత్వం ద్వారా, జిల్లాలో కనీస మద్దతు ధర రూపాయలు 822 కోట్ల నిధులను, సన్నరకము ధాన్యము కొనుగోళ్ల బోనస్ విషయమై ప్రభుత్వం ద్వారా 96 కోట్ల 85 లక్షల నిధులను రైతుల ఖాతాలో జమ చేయడం జరిగింది అన్నారు.సి.ఎం.ఆర్ డెలివరి లో బాగంగా, ప్రభుత్వ నిబంధనల క్రమము ఖరీఫ్ - 2024-25 సీజన్ కి సంబంధించి 100% పూర్తి చేయడం జరిగింది, రబీ 2024-25 సంబంధించి నేటి వరకు 79% ప్రస్తుత ఖరీఫ్ - 2025-26 సీజన్ కి సంబంధించి కూడా సి.ఎం.ఆర్ డెలివరి ప్రారంబించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## ఓపెన్ జిమ్ కు శంకుస్థాపన



**ఎల్లారెడ్డిపేట డిసెంబర్ 30 (ప్రజా జ్యోతి):** ఎల్లారెడ్డిపేట మండల లోని రాచర్ల గొల్ల పెల్లికి చెందిన నూతన పాలకవర్గం మంగళవారం రోజున యువతి యువకుల కొరకు వ్యాయామశాలను (ఓపెన్ జిమ్మును) ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా గొల్లపల్లి సర్పంచి కొండ రమేష్ గౌడ్ మాట్లాడుతూ యువతీ యువకులు శరీర దారుద్యాన్ని మానసిక ఉల్లాసానికి ఓపెన్ జిమ్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదంతో మొట్టమొదటిగా గ్రామపంచాయతీ పాలకవర్గం చే భూమి పూజ చేశామని సర్పంచి తెలియజేశారు .ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మనమ్మ వార్డు మెంబర్లు రామచంద్రం ,పరుశరాములు ,దేవరాజు, సురేష్, డాక్టర్ ఆంజనేయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పశువులకు ఉచిత నట్టల మందు పంపిణీ



**సైదాపూర్ డిసెంబర్ 30 ప్రజా జ్యోతి:** మండలంలోని అమ్మనగుర్తి స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలో ఉప సర్పంచ్ లంకదాసరి కార్తీక్ గారి ఆధ్వర్యంలో పశువైద్య శాఖ సహకారంతో పశువులకు ఉచితంగా నట్టల నివారణ మందు (%ణవషశీతీఎఱఅస్త్ర%) పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెటరినరీ డాక్టర్ విజేందర్ రావు మాట్లాడుతూ వర్షాకాలం మరియు శీతాకాలంలో పశువులకు సోకే వ్యాధులను అరికట్టడం. వాటిలో రోగనిరోధక శక్తిని పెరుగుతుందని నట్టల వల్ల పశువులు నీరసించి, పాల దిగుబడి తగ్గే అవకాశం ఉంది. కావున ప్రతి రైతు తమ పశువులకు తప్పనిసరిగా నట్టల మందు వేయించాని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజేందర్ రావు.యాదవ నాయకులు భాషవేణి ఓదెలు, ముస్కె మహేష్, ముస్కె బుచ్చయ్య,ముస్కె సంపత్ ముత్యం మల్లయ్య, ముత్యం ఐలయ్య రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


## రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన పారమిత విద్యార్థులు



**కరీంనగర్ టౌన్, డిసెంబర్ 30( ప్రజాజ్యోతి):** ఈ నెల 28,29 వ తేదీలలో తెలంగాణ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నారాయణఖేడ్ జిల్లా లో జరగనున్న 69 వ తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్-14(బాల బాలికల) హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలకు స్థానిక పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన ఎ. హాస్య పటేల్ , ఎ.మోక్షజ్ఞ 8 వ తరగతి, పి. శౌర్యవన్ తేజ్ 7 వ తరగతి విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ తెలిపారు. అదేవిధంగా ఇటీవల రాజన్న సిరిసిల్ల జిల్లా లో జరిగిన అండర్-14 (బాల బాలికల) ఉమ్మడి జిల్లాస్థాయి ఎంపిక పోటీలలో విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల చైర్మన్ డాఎఎ ఇ. ప్రసాదరావు, డైరెక్టర్స్ ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, రాకేశ్, వి.యు.యం.ప్రసాద్, కె.హన్మంతరావు, ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపికృష్ణ, సమన్వయ కర్తలు నాగరాజు, రాము మరియు వ్యాయామ ఉపాధ్యాయుడు యస్. రాజు, అమరేందర్ లు పాల్గొన్నారు.

## జిల్లా జెం టుకలెక్టర్గా పదోన్నతి పొందిన తహసిల్దార్. పుల్లూరి జగదీశ్వరరావుకు సన్మానం

**ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గం మల్లేష్**




**కాల్వ శ్రీరాంపూర్ డిసెంబర్ 30 (ప్రజా జ్యోతి):**కాల్వ శ్రీరాంపూర్ మండలంలో తహసిల్దారుగా విధులు నిర్వహిస్తున్న పుల్లూరు జగదీశ్వర్ రావు కు జిల్లా జెంట్ కలెక్టర్గా పదోన్నతి పొందారు ఈయనను ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గం మల్లేష్ జిల్లా నాయకులు బందెల శ్రీనివాస్ సోమవారం రోజున కలిసి. శు భాకాంక్షలు తెలుపుతూ. శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# తండ్రి మరణంలోనూ మానవత్వం చాటిన జర్నలిస్టు సోదరులు

**- నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగు**



**ఎన్టిపిసి,(ప్రజా జ్యోతి), ,డిసెంబర్ 30:** తండ్రిని కోల్పోయిన అపార దుఃఖాన్ని గుండెల్లో దాచుకుని కూడా మానవత్వానికి నిలువెత్తు ప్రతీకలుగా నిలిచారు జర్నలిస్టు సోదరులు మామిడి కుమారస్వామి, మామిడి సత్యనారాయణ. సదాశయ ఫౌండేషన్, రామగుండం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తమ తండ్రి రాయలింగు (72) నేత్రాలను మంగళవారం దానం చేసి సమాజానికి ఆదర్శంగా నిలిచారు.గోదావరిఖని శాలపల్లి లోని మృతుడి కుమారుడు మామిడి కుమారస్వామి నివాసంలో నిర్వహించిన ఈ నేత్రదాన కార్యక్రమాన్ని సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రచార కార్యదర్శి కే.ఎస్. వాసు సమన్వయంతో, ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సహకారంతో విజయవంతంగా చేపట్టారు. ఈ పవిత్ర నిర్ణయంతో ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగు నిండనుంది.వ్యక్తిగత దుఃఖంలోనూ దానగుణం ఎలా ఉండాలో ఈ సోదరులు సమాజానికి స్ఫూర్తిగా నిలిచారని పలువురు ప్రశంసించారు. కార్యక్రమానికి సహకరించిన మృతుని భార్య లక్ష్మీతో పాటు కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ సభ్యులు అభినందించారు.ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ సీనియర్ కార్యదర్శి, ఎంబీసీ మెంబర్ బాబర్ సలీం పాషా, ప్రెస్ క్లబ్ జనరల్ సెక్రటరీ గడ్డం శ్యామ్ కుమార్, కోశాధికారి రాజ్ కుమార్,టీయూడబ్ల్యూజే జిల్లా ఎథిక్స్ కమిటీ కో-కన్వీనర్ పందిళ్ళ శ్యామ్ సుందర్, సీనియర్ పాత్రికేయులు పెద్దపల్లి సత్యం, దుబ్బల శేఖర్, సాగర్, బైరం సతీష్, జక్కం సత్యనారాయణ, డాక్టర్ సంపత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.డి. రహీం, మాజీ కార్పొరేటర్లు వెంగల బాపు పద్మ, కృష్ణవేణి, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు భూమళ్ళ చందర్, డివిజన్ ఇంచార్జీ ఈదునూరి రవి తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ స్మైల్-కి సమన్వయ సమావేశాలు

**జనవరి 1 నుంచి 31 వరకు ప్రత్యేక కార్యక్రమం**

**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి ,(ప్రజా జ్యోతి), డిసెంబర్ 30 :** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో చేపట్టనున్న ఆపరేషన్ స్మైల్- కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి జిల్లా స్థాయి సమన్వయ సమావేశాలు నిర్వహించారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు, మంచిర్యాల డీసీపీ కార్యాలయంలో డీసీపీ ఏ.భాస్కర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. అలాగే పెద్దపల్లి జోన్ పరిధిలో పెద్దపల్లి ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ జి.కృష్ణ ఆధ్వర్యంలో మరో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాలకు డీడబ్ల్యూ ఓ, డీసీపీయూ, సీడబ్ల్యూసీతో పాటు కార్మిక, ఆరోగ్య, విద్యాశాఖల అధికారులు, పోలీస్ అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.రామగుండం కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, బెల్లంపల్లి, జైపూర్, పెద్దపల్లి జోన్‌లోని పెద్దపల్లి, గోదావరిఖని సబ్‌డివిజన్లలో 18 సంవత్సరాల లోపు తప్పిపోయిన బాలురు, బాలికలను గుర్తించి వారి వివరాలు సేకరించి తల్లిదండ్రులకు అప్పగించి కౌన్సిలింగ్ చేయాలని అధికారులకు సూచించారు.అలాగే బాలకార్మికులు, భిక్షాటనలో ఉన్న పిల్లలు, వదిలివేయబడ్డ పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించడంతో పాటు, బలవంతంగా భిక్షాటన చేయిస్తున్నవారు, వెట్టి చాకిరి చేయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ నేపథ్యంలో జనవరి 1 నుంచి జనవరి 31 వరకు ప్రత్యేకంగా ఆపరేషన్ స్మైల్- కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి డివిజన్ పరిధిలో ఒక ఎస్ఐ స్థాయి అధికారిని నియమించి, ఆయన ఆధ్వర్యంలో నలుగురు సిబ్బంది, ఒక మహిళా కానిస్టేబుల్‌తో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.సేకరించిన సమాచారాన్ని పోలీస్ కమిషనరేట్ స్థాయిలో సమగ్రంగా పరిశీలించి, హైదరాబాద్‌లోని మహిళా భద్రతా విభాగం అధికారులకు తెలియజేస్తామని తెలిపారు. తప్పిపోయిన బాలురు, బాలికలు లేదా బాలకార్మికులపై సమాచారం ఉన్న ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు .



# జూలై 2026 వరకు కూనారం ఆర్.ఓ.బి నిర్మాణం పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**-ఆర్.ఓ.బీ పెండింగ్ భూ సేకరణ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి**

**-4 నెలల కాలంలో జడ్పీ కార్యాలయం నిర్మాణం పూర్తి చేయాలి**

**-పెద్దపల్లి పట్టణంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి ,(ప్రజా జ్యోతి), డిసెంబర్-30:** జూలై 2026 వరకు కూనారం ఆర్.ఓ.బి నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి కూనారం రైల్వే పై ఓవర్ బ్రిడ్జి, ఆర్ అండ్ బి అతిథి గృహం ప్రహరి గోడ, జడ్పి కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, 119 కోట్ల 50 లక్షల వ్యయంతో పెద్దపల్లి కూనారం రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రభుత్వం నిర్మిస్తుందని తెలిపారు. పెద్దపల్లి కూనారం ఆర్.ఓ.బీ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన పెండింగ్ భూ సేకరణ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ఆర్ అండ్ బి అధికారులకు అప్పగించాలని కలెక్టర్ రెవెన్యూ డివిజన్ అధికారి కి సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదలైన నేపథ్యంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని, జూలై 2026 నాటికి ఆర్.ఓ.బీ పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకుని రావాలని కలెక్టర్ ఆదేశించారు. మార్చి 2026 నాటికి అండర్ పాస్ నిర్మాణ పనులు రైల్వే శాఖ పూర్తి చేయాలని అన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జికి సంబంధించిన సర్వీస్ రోడ్డు పనులు సమాంతరంగా జరగాలని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహం ప్రహరి గోడ నిర్మాణ పనులు పూర్తి చేసి, అవసరమైన ల్యాండ్ స్కేపింగ్ పనులు చేపట్టాలని అన్నారు. అతిథి గృహం వద్ద వి.ఐ.పి లు బస చేసే సమయంలో భద్రత సరిగ్గా ఉండేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. పెద్దపల్లి తహసిల్దార్ కార్యాలయ సమీపంలో నిర్మిస్తున్న జడ్పీ కార్యాలయం నిర్మాణ పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని, పనులలో వేగం పెంచాలని ఏప్రిల్ 2026 నాటికి జడ్పీ కార్యాలయం అందుబాటులోకి తీసుకొని రావాలని కలెక్టర్ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి గంగయ్య, ఈఈ ఆర్ బీ భావ్ సింగ్, తహసిల్దార్ రాజ్ కుమార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# యూరియా సరఫరా నిరంతరం పర్యవేక్షించాలి

**- ప్రతిరోజు సరఫరా, నిల్వల నివేదిక సమర్పించాలి - రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వద్దు**

**- అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే**



**కరీంనగర్ బ్యూరో, డిసెంబర్ 30 (ప్రజాజ్యోతి):** మండల, క్లస్టర్ స్థాయిలో వ్యవసాయ అధికారులు ప్రతిరోజు యూరియా సరఫరాపై పర్యవేక్షించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మండల వ్యవసాయ అధికారులు, ప్రాథమిక సహకార సంఘాల అధికారులతో యూరియా నిల్వలు, సరఫరా, వ్యవసాయ శాఖ కేంద్ర ప్రభుత్వ పథకాలు, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి మండలంలోని ప్రైవేటు డీలర్లు, మార్క్ ఫెడ్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల గోదాముల్లో నిల్వలను, భవిష్యత్తు అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 4246 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ప్రస్తుత అవసరానికి యూరియా నిల్వలు సరిపోతాయని అన్నారు. కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు యూరియా సరఫరా లో ఇబ్బందులు ఎదురైతే సంబంధిత వ్యవసాయ అధికారికి తెలియజేయాలని అన్నారు. రైతులు యూరియా సరఫరాలో ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే మండల, క్లస్టర్ వ్యవసాయ అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకుండా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతిరోజు ఎరువుల నిల్వలు, అమ్మకాల వివరాలు జిల్లా కేంద్రానికి తెలియజేయాలని అన్నారు. పీఎం సమ్మాన్, ఫసల్ బీమా, పీఎం కిసాన్ యోజన, కృషి విజ్ఞాన కేంద్రం, ధాన్యం కొనుగోలు తదితర అంశాలు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షించారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, మండల వ్యవసాయ అధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బాధ్యులు, మార్కెటింగ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బి.ఆర్ఎస్ గూటికి నూతన వార్డ్ మెంబర్

**కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన పుట్ట మధుకర్, మండల బి.ఆర్ఎస్ అధ్యక్షుడు పోతుపెద్ది కిషన్ రెడ్డి**




**ముత్తారం డిసెంబర్,30 (ప్రజా జ్యోతి):** మండల కేంద్రంలోని 5వ వార్డు మెంబెర్ అనుము హేమలత లక్ష్మణ్ మంగళవారం మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా పుట్ట మధుకర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి, ముత్తారం గ్రామ సర్పంచ్ సుదాటి రవీందర్రావు,లక్కారం గ్రామ సర్పంచ్ చంద్రమౌళి,మాజీ సర్పంచ్ నూనె కుమార్,గ్రామ శాఖ అధ్యక్షుడు అలవోజు రవీందర్ చారి,చల్ల సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

# భీమా కోరేగావ్ అణచివేతపై ఆత్మగౌరవ గర్జన


**-1818 జనవరి 1న చరిత్ర మలుపు-28 వేల పీష్వా సైన్యంపై 500 మహర్ వీరుల విజయం**

**-వర్ణాధిపత్యానికి సవాల్ విసిరిన శౌర్య ఘట్టం**






**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి,( ప్రజాజ్యోతి), డిసెంబర్ 30:** దేశ చరిత్రలో జనవరి 1వ తేదీ కేవలం నూతన సంవత్సర ఆరంభం కాదు. శతాబ్దాల అణచివేతపై అట్టడుగు వర్గాలు సాధించిన ఆత్మగౌరవ విజయానికి ప్రతీకగా నిలిచిన రోజు. 1818 జనవరి 1న భీమా నది ఒడ్డున ఉన్న కోరేగావ్ గ్రామంలో జరిగిన యుద్ధం, మనువాద పీష్వా సామాజిక ఆధిపత్యంపై మహర్ వీరులు సాధించిన చారిత్రక విజయం. ఈ పోరాటం భారత సామాజిక చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది. **బానిసత్వ సంకెళ్లకు తెగులు:** రెండో బాజీరావు పీష్వా సేన పూణేను చుట్టుముట్టిన సమయంలో బ్రిటీష్ సేనలు తీవ్రమైన సైనిక కొరతను ఎదుర్కొన్నాయి. ఆ తరుణంలో పీష్వాల అణచివేతకు గురైన మహర్ యోధులను బొంబాయి కాల్బలంలో చేర్చారు. క్యాప్టెన్ స్టాటన్ నేతృత్వంలో ఈ సేన ముందుకు కదిలింది. **ఆత్మగౌరవమే ఆయుధం:** మహర్ సేనానాయకుడు సుబేదార్ శికనాక్ తొలుత స్వదేశీయులపై యుద్ధానికి సందేహించారు. అయితే పీష్వా సేనాధికారి బాపు గోఖలే ఇచ్చిన అవమానకర సమాధానం ఆయన నిర్ణయాన్ని మార్చింది. వర్ణాశ్రమ ధర్మం ప్రకారం అట్టడుగు స్థానమే మీ విధి అన్న మాటలు, ఈ యుద్ధం రాజ్య రక్షణ కోసం కాదని సామాజిక ఆధిపత్య పరిరక్షణ కోసమేనని స్పష్టం చేశాయి. దీంతో జాతి గౌరవం కోసం యుద్ధమే శరణ్యమని శికనాక్ నిర్ణయించారు. **500 మంది 28 వేల మందిపై వీరోచిత పోరాటం:** 1818 జనవరి 1న చరిత్ర సృష్టించబడింది. కేవలం 500 మంది మహర్ వీరులు, 28 వేల మంది పీష్వా సైన్యాన్ని ఎదుర్కొన్నారు. ఆకలి, దప్పికలను లెక్కచేయకుండా ఒక్కొక్కరు యాభై మందితో సమానంగా పోరాడారు. లొంగిపోవాలని సూచించినా శికనాక్ తిరస్కరించారు. ఆధిపత్య అహంకారం ఆ రోజున భీమా నది ఒడ్డున తలవంచింది. **విజయానికి స్మారకంగా స్థూపం:** ఈ ఘన విజయానికి గుర్తుగా 1821లో కోరేగావ్‌లో విజయ స్థూపం నిర్మించారు. అయితే ఈ చరిత్రను మరిచిపోయేలా చేయడానికి ప్రయత్నాలు జరిగాయి. 1927లో అంటరాని వర్గాలను సైన్యంలో చేర్చకూడదన్న నిర్ణయాన్ని డా. బి.ఆర్. అంబేద్కర్ తీవ్రంగా వ్యతిరేకించారు. అనంతరం ప్రతి ఏటా జనవరి 1న విజయ స్థూపాన్ని సందర్శించి నివాళులర్పించే సంప్రదాయాన్ని బాబాసాహెబ్ ప్రారంభించారు. **శౌర్య దినోత్సవం నేటి తరానికి సందేశం:** భీమా కోరేగావ్ యుద్ధం రాజ్యాల మధ్య జరిగిన పోరాటం కాదు. అది మానవ గౌరవం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం సాగిన మహత్తర యుద్ధం. జనవరి 1ను శౌర్య దినోత్సవంగా జరుపుకుంటూ ఈ వీరుల త్యాగాలను నేటి యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.- **డా. మార్షల్ దుర్గం నగేష్**-ఉపాధ్యక్షులు, సమతా సైనిక్ దళ్ (తెలంగాణ రాష్ట్రం), సెల్:9494333899.



# శాంతియుత వాతావరణం లో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలి

**చట్టాలను అతిక్రమించి వ్యవహరించిన వారి పైన కఠిన చర్యలు ఉంటాయి**

**ముత్తారం ఎస్.ఐ ఎన్. రవికుమార్**

**ముత్తారం,డిసెంబర్ 30(ప్రజా జ్యోతి):** మండల ప్రజలు శాంతియుత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలని ముత్తారం ఎస్ ఐ రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 31 వ తేదీ వేడుకల ముందస్తు చర్యల్లో భాగంగా ముఖ్యంగా యువత రాత్రి ఎలాంటి ఇబ్బందికర సంఘటనలు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా వేడుకలను జరుపుకోవాలని ఎస్.ఐ సూచించారు. ప్రధాన కూడళ్లలో స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ ఆకస్మిక వాహనల తనిఖీలు నిర్వహించబడతాయని, గ్రామలలో డిజే సౌండ్ బాక్స్ లకు అనుమతి లేదని, మద్యం సేవించి




వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను రాత్రివేళ వేడుకల కోసం బయటకు పంపించి ఇబ్బందులు పడొద్దని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో కాకుండా ప్రజలు కుటుంబ సమేతంగా తమ నివాసాల్లో శాంతియుత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలి చట్టాలను అతిక్రమించి వ్యవహరిస్తే ఎలాంటి వారినైనా ఉపేక్షించకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రజలకు సూచించారు.

# శివకేశవ ఆలయంలో ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి ఉత్సవాలు

**చొప్పదండి, డిసెంబర్ 30 ( ప్రజా జ్యోతి):** చొప్పదండి శివకేశవ ఆలయంలో మంగళవారం ఉదయం వివేకానంద యూత్ క్లబ్ నిర్వహణ లో ఆలయ అర్చకులు జనగామ సత్యనారాయణ, సింహాచలంప్రభాకారచార్యులు,మురళిచార్యులు రాఘవులు ఉత్తర ద్వార దర్శనం, పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శివకేశవ స్వాముల కళ్యాణమహోత్సవం ఘనంగా నిర్వహించారు. పూసాల భూమేశ్-వసంత దంపతులు పుస్తెమట్టెలు పట్టువస్త్రాలు,తలంబ్రాలు సమర్పించారు. శివకేశవ



స్వాముల దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఈ కార్యక్రమంలో వివేకానంద యూత్,క్రబ్ అద్యక్షులు కస్తూరి వెంకటేశం, సెక్రటరీ ఐట్ల మల్లేశం, కోశాధికారి సిరిపురం తిరుపతి, దూస రాము, తాటిపెల్లి అంజయ్య, మామిడాల నిరంజన్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ భూమిరెడ్డి, బలిజ మల్లిఖార్జున్,పూసాల భూమేశ్ కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# చట్టానికి లోబడి నూతన సంవత్సర వేడుకలు

**తాత్కాలిక ఆనందం కోసం భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు**

**- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి,( ప్రజా జ్యోతి ), డిసెంబర్ 30:** రామగుండం



పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రజలందరికీ పోలీస్ శాఖ తరపున నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ, వేడుకలను శాంతియుతంగా, చట్టానికి లోబడి నిర్వహించుకోవాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా విజ్ఞప్తి చేశారు. తాత్కాలిక ఆనందం కోసం భవిష్యత్తును నాశనం చేసుకునేలా ప్రవర్తించవద్దని ఆయన హెచ్చరించారు. డిసెంబర్ 31 రాత్రి 10 గంటల నుంచి కమిషనరేట్ పరిధిలో స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి, బైండ్‌ఓవర్ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఇతరుల మనోభావాలు దెబ్బతినకుండా, ప్రమాదాలకు దూరంగా ఉండాలని కోరారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా స్థానిక పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, షీ టీమ్స్, మఫ్టీ టీమ్స్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బందితో కలిసి ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్రమ సిట్టింగులు, బహిరంగ మద్యం సేవనం, మహిళల వేధింపుల వంటి ఘటనలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వేడుకలను అర్ధరాత్రి 12.30 గంటలలోపు ముగించుకోవాలని సూచిస్తూ, సాంస్కృతిక కార్యక్రమాలకు ముందస్తు పోలీస్ అనుమతులు తప్పనిసరి అని తెలిపారు. అశ్లీల నృత్యాలకు అనుమతి లేదని, వేడుకల ప్రాంగణాల్లో సీసీ కెమెరాలు, భద్రతా సిబ్బంది తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. డీజేలు, మైకుల వినియోగం, బాణసంచా పూర్తిగా నిషేధించబడిందని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. మద్యం దుకాణాలు, వైన్ షాపులు, బార్లు ప్రభుత్వం నిర్ణయించిన సమయాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లో మద్యం సేవించి వేగంగా లేదా నిర్లక్ష్యంగా వాహనాలు నడిపిన వారిపై వాహనాలు సీజ్ చేయడం, జరిమానాలు విధించడం, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడం వంటి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనం నడిపినప్పటికీ చర్యలు తప్పవన్నారు. యువతపై కేసులు నమోదైతే భవిష్యత్తులో ఉద్యోగాలు, విదేశీ ప్రయాణాల విషయంలో సమస్యలు ఎదురయ్యే అవకాశముందని హెచ్చరిస్తూ, మద్యం సేవించకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలపై పర్యవేక్షణ ఉంచాలని కోరారు. వేడుకల సందర్భంగా వాహన తనిఖీలు, పికెట్లు, మఫ్టీ టీమ్స్, కీలక కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు వంటి ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నిషేధిత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల విక్రయం లేదా వినియోగం జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకలను కుటుంబ సమేతంగా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, చట్టబద్ధంగా జరుపుకోవాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# గుమ్లాపూర్ లో డప్పు కళాకారుల నూతన కార్యవర్గం

**చొప్పదండి, డిసెంబర్ 30 (ప్రజా జ్యోతి):** చొప్పదండి మండలం లోని గుమ్లాపూర్ గ్రామంలో శ్రీ వెంకటేశ్వర డప్పు కళాకారుల నూతన కార్యవర్గంను మంగళవారం ఎన్నుకున్నారు. అద్యక్షులుగా దాసరి వెంకటేష్, ఉపాధ్యక్షులుగా గజ్జల లక్ష్మణ్ ,క్యాషియర్ గా కొమ్ము సంపత్, సహాయ క్యాషియర్ గా పెద్దెల్లి ప్రశాంత్, ప్రజెంట్ గా కొలపురి కార్తీక్, కొలపురి హరీష్ బాబు ఎన్నికయ్యారు.



# మతాలు వేరైనా భక్తి ఒక్కటే

**వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మైనార్టీ నేత ఎంఏ సమద్**



**తిమ్మాపూర్ డిసెంబర్ 30 ( ప్రజాజ్యోతి ):**
కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి కాలనీలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరుగుతున్న వేళ మత సామరస్యానికి ప్రతీక గా ఒక అరుదైన సన్నివేశం ఆవిష్కృతమైంది. దీనికి ఇంతటి ప్రాధాన్యత ఎందుకంటే ముస్లిం మైనార్టీ సామాజిక వర్గానికి చెందిన నేత ఎంఏ సమద్ కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ ఎం డి కాలనీలోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి పూర్వకంగా పూజలు చేశారు.ఈ సన్నివేశం మత సామరస్యానికి, సౌభ్రాతృత్వానికి ఆదర్శంగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. వైకుంఠ ఏకాదశి రోజున ఉత్తర ద్వార దర్శనం మోక్ష ప్రాప్తికి దారి తీస్తుందనే నమ్మకంతో రాష్ట్రవ్యాప్తంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్న నేపథ్యంలో ముస్లిం మైనార్టీమతాలు వేరైనా భక్తి ఒక్కటే. వర్గానికి చెందిన నేత ఈ ప్రత్యేక పూజలు చేయడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఈ సందర్భంగా ఎం ఏ సమద్ మాట్లాడుతూ, దేవుడు ఒక్కడే,మతాలు వేరైనా భక్తి ఒక్కటే. వెంకటేశ్వర స్వామిపై నాకున్న భక్తి కారణంగా ఈ పూజలు నిర్వహించాను అని తెలిపారు. ఇటీవల మహాత్మానగర్లో జరిగిన అయ్యప్ప స్వామి ఆలయ ప్రతిష్టాపన కార్యక్రమంలోనూ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించానని చెప్పారు. హిందువులకు సంబంధించిన అన్ని పండుగల్లోనూ మత సామరస్యానికి ప్రతీకగా పాల్గొంటున్నానని సమద్ తెలిపారు.

# లక్ష్మీపూర్ గ్రామంలో ఉచిత నటల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం

**తంగళ్ళపల్లి డిసెంబర్30(ప్రజా జ్యోతి):**
ముఖ్యతిథిగా పాల్గొన్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వై నికిత,వెటర్నరీ డాక్టర్ అంజిరెడ్డి కే మౌనిక. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ రైతులు విధిగా తమకు చెందిన గొర్రెలకు నట్టల నివారణ మందును వేయించాలని సూచించారు. గొర్రెలలో నట్టల వల్ల శారీరక బలహీనతతో పాటు ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు.గొర్రెల అనారోగ్యాలకు నట్టలు కారణమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాయి కృష్ణ,తంగళ్ళపల్లి మండల యాదవ సంఘం అధ్యక్షులు బండి దేవేందర్ యాదవ్,ప్రధాన కార్యదర్శి మాందాటి తిరుపతి యాదవ్,ముఖ్య సలహాదారులు గోట్ల ఐలయ్య యాదవ్,చెన్నవేణి తిరుపతి యాదవ్,ఉప సర్పంచ్ పరశు రాములు,ఏఎంసి డైరెక్టర్ బాలు మరియు వార్డ్ మెంబర్లు లక్ష్మీపూర్ యాదవ సంఘం అధ్యక్షుడు ఆర్కుటి రాములు,గోర్ల పెంపకం దారులు మల్లయ్య,చీమల ఎల్లయ్య,జడ మల్లయ్య,నాగసాని ఎల్లయ్య,ధరణి కనుకయ్య,పశుసంధర శాఖ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.



# మీ భద్రత - ప్రయాణికుల భద్రత మన అందరి బాధ్యత

**ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించిన సీఐ ఇంద్రసేనా రెడ్డి**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి,( ప్రజా జ్యోతి), డిసెంబర్ 30 :**
రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా గోదావరిఖని- టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనా రెడ్డి ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియమాల పాటింపు, సురక్షిత ప్రయాణం, మద్యం సేవించి వాహనం నడపకూడదనే అంశాలపై డ్రైవర్లకు విస్తృతంగా అవగాహన కల్పించారు.వాహనానికి సంబంధించిన డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పొల్యూషన్ పత్రాల ప్రాముఖ్యతను వివరించారు. అన్ని పత్రాలు చెల్లుబాటు అయ్యేలా ఉంచుకోవాలని, ప్రమాదం జరిగినప్పుడు ఇన్సూరెన్స్ వర్తించాలంటే తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా సీఐ ఇంద్రసేనా రెడ్డి మాట్లాడుతూ, ప్రయాణికుల భద్రతలో ఆటో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రతి డ్రైవర్ బాధ్యతాయుతంగా వాహనం నడిపితే అనేక రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ఆటోలో తమ కుటుంబ సభ్యులు, తల్లిదండ్రుల ఫోటోలు ఉంచుకోవాలని సూచిస్తూ, మద్యం సేవించి వాహనం నడిపే సమయంలో లేదా తప్పు చేసే వేళ ఆ ఫోటోలను చూసి కుటుంబ భవిష్యత్తును గుర్తు చేసుకోవాలని హితవు పలికారు.మీరు చేసే చిన్న తప్పు వల్ల కూడా కుటుంబం రోడ్డుపాలయ్యే పరిస్థితి రావచ్చని హెచ్చరిస్తూ, ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.అలాగే ఏదైనా అనుమానాస్పద సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. కొందరి ఆటో డ్రైవర్ల తప్పు ప్రవర్తన వల్ల మొత్తం వృత్తికే చెడ్డ పేరు వస్తోందని, అలాంటి వారి వివరాలు అందిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు

# కాకతీయ పాఠశాలలో విద్యార్థులకు లెర్నర్స్ లెడ్ కాన్ఫరెన్స్

**-విద్యార్థులను అభినందించిన తల్లిదండ్రులు**

**-మెరుగైన విద్యను అందించడమే కాకతీయ విద్యా సంస్థల లక్ష్యం**

**-కాకతీయ విద్యాసంస్థల అధినేత అవిర్నేని సుధాకర్ రావు**



**జమ్మికుంట, డిసెంబర్ 30 ( ప్రజాజ్యోతి ):**
జమ్మికుంట పట్టణంలోని కాకతీయ పాఠశాలలో విద్యార్థులు వివిధ అంశాలపై ప్రెజెంటేషన్లు, ప్రాజెక్టులు, సృజనాత్మక ఆలోచనలను ప్రదర్శించేందుకు 'లెర్నర్స్ లెడ్ కాన్ఫరెన్స్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులే స్వయంగా తయారు చేసిన ప్రాజెక్టులు ఏర్పాటు చేసి విద్యార్థులు తమ అభిప్రాయాలు, ఆలోచనలు, నేర్చుకున్న విషయాలను స్వయంగా ప్రదర్శించే అవకాశం కల్పించారు. కాకతీయ విద్యాసంస్థల అధినేత చైర్మన్ కరస్పాండెంట్ అవిర్నేని సుధాకర్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కరస్పాండెంట్ అవిర్నేని సుధాకర్‌రావు మాట్లాడుతూ... విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. నేటి విద్యా విధానంలో కేవలం పుస్తక జ్ఞానం మాత్రమే కాకుండా, కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రెజెంటేషన్ నైపుణ్యాలు కూడా కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆధునిక తరగతి గదులు, ప్రయోగశాలలు, లైబ్రరీ, క్రీడా సౌకర్యాలు వంటి వసతులను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉన్నత విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు ముఖ్య అతిథులను తల్లిదండ్రులను అలరించారు. విద్యార్థులు వివిధ అంశాలపై ప్రెజెంటేషన్లు, ప్రాజెక్టులు, సృజనాత్మక ఆలోచనలను ప్రదర్శించి తల్లిదండ్రులను ఆకట్టుకున్నారు. విద్యార్థులు వివరించిన అంశాలపై తల్లిదండ్రులు సంతృప్తి చెంది విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఇటుకబట్టిల్లో పిల్లలను బడిలో చేర్పించాలి

**మండల విద్యాధికారి ప్రభాకర్**



**ధర్మారం డిసెంబర్ 30(ప్రజా జ్యోతి న్యూస్):**
ప్రతీ ఒక్కరి జీవితంలో బాల్యదశ అతి ముఖ్యమైనదని,ఈ దశలో పిల్లలను ఇటుకబట్టిల్లో ఉంచి వారిని విద్యనుండి దూరం చేయవద్దని,బాల్యాన్ని ఇటుకబట్టిల్లో బందీగా మార్చవద్దని ధర్మారం మండల విద్యాధికారి పోతు ప్రభాకర్ అన్నారు.మంగళవారం ఉదయం ఓ.ఎస్. సీ (బడిబయట పిల్లల) సర్వేలో భాగంగా మండలంలోని బొమ్మారెడ్డిపల్లి సమీపంలో పలు ఇటుకబట్టీలను ఆయన సందర్శించి పదిహేను మంది పిల్లలను స్థానిక ధర్మారం మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు.సమగ్ర శిక్షా కార్యక్రమం ద్వారా అందరికీ విద్య మనందరి భాద్యత అనీ, అందరినీ చదివించేలా,జీవితంలో అందరూ ఉన్నంతంగా ఎదిగేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని మండల విద్యాధికారి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ధర్మారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. మల్లారెడ్డి,క్లస్టర్ రిసోర్స్ పర్సన్ కొండ కవిత,విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# చొప్పదండి పట్టణ సమస్యలపై కమిషనర్ కు వినతి పత్రం

చొప్పదండి, డిసెంబర్ 30(ప్రజాజ్యోతి): . చొప్పదండి పట్టణంలోఅండర్ డ్రైనేజ్, సిసి రోడ్లు , వీది దీపాల సమస్యలు, మంచినీటి వాటర్ ట్యాంక్ కింద ఉన్న టేకు చెట్లు కొట్టివేత, సెంట్రల్ లైటింగ్, సి సి కెమెరాలు ఏర్పాటు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణ బిజెపి ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ నాగరాజుకు వినతిపత్రం సమర్పించారు. చొప్పదండిలో ప్రధాన సమస్యగా మారిన సెంట్రల్ లైటింగ్ రోడ్ విస్తరణ పనులని మధ్యంతరంగా నిలిపివేసినందున పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. పట్టణం లో నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి లో "పోస్టుమార్టం" భవనాన్ని చుట్టు పక్కన ఉన్న స్థానికులకు ఇబ్బంది కలగకుండా నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. అంతు చిక్కని వ్యాదితో కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయని తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.వార్డులలో పలు సమస్యలపై బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ సమస్యలను వారం రోజుల్లో తగిన పరిష్కారం చూపించని ఎడల నిరసన కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షుడు ప్రశాంత్,జిల్లా కౌన్సిల్ సభ్యులు శివ శంకర్,సీనియర్ నాయకులు నరేష్,జిట్ట కుమార్,చల్ల అనూష్,జాగిరి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# దివాళా తీసేలా మితిమీరిన రాజకీయ జోక్యం

**-సింగరేణిని ఆర్థికంగా పీల్చి పిప్పి చేస్తున్న రాష్ట్ర సర్కార్-విమర్శించే నైతిక హక్కు జాతీయ సంఘాలకు లేదు**

**-నిధుల దుర్వినియోగంపై శ్వేతపత్రం విడుదల చేయాలి -టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిరియాల**




గోదావరిఖని , డిసెంబర్ 30(ప్రజా జ్యోతి): మితిమీరిన రాజకీయ జోక్యం వల్ల సింగరేణి ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిరియాల రాజిరెడ్డి ఆరోపించారు.మంగళవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి వల్ల సింగరేణి తీవ్రంగా నష్టపోతుందని వాపోయారు.సంస్థను పీల్చి పిప్పి చేసే విధానాలను అవలంబిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.నిర్వహణ పూర్తిగా గాడి తప్పిందని,ఓవర్ డ్రాఫ్ట్ తో వేతనాలు చెల్లించే పరిస్థితి తలెత్తిందని రాజిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.సి ఎస్ ఆర్,డి ఎం ఎఫ్ టి నిధులను విచ్చలవిడిగా ఖర్చు చేస్తుందని,కార్పొరేషన్ చేయాల్సిన పనులను సింగరేణి చే చేయించడం ఎంతవరకు సమంజసమని,ఈ విషయంలో అప్పటి బి ఆర్ ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించిన కాంగ్రెస్ నాయకులు ఇపుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సింగరేణికి సంబంధించిన నిధుల దుర్వినియోగం పై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ట్రాన్స్కో జెన్కో తదితర సంస్థల నుంచి సింగరేణికి రావలసిన రూ.47 వేల కోట్ల బకాయిలను ప్రభుత్వమే చెల్లించాలని,పదేళ్ల టీఆర్ఎస్ పాలనలో రూ.29వేల కోట్ల బకాయి పడిందని,రెండేళ్ల కాంగ్రెస్ హయాంలో రూ.24 వేల కోట్ల బకాయి పడిందన్నారు.టీఆర్ఎస్ ప్రభుత్వ రాజకీయ జోక్యంవల్లసింగరేణికార్మికుల హక్కులు,సంక్షేమం,విద్యా,వైద్యానికి ఉపయోగపడిందని,కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ జోక్యం వల్ల సింగరేణి అన్ని రకాలుగా నష్టపోతుందని చెప్పారు.సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ,ప్రాతినిధ్య కార్మిక సంఘంఐఎన్టీయూసి వంత పాడుతున్నాయని ఆక్షేపించారు.కార్మిక హక్కులను కాలరాస్తున్న జాతీయ సంఘాలకు టీఆర్ఎస్ పార్టీని గానిటీబీజీకేసునుగానివిమర్శించేనైతికహక్కులేదన్నారు.విలేకరుల ఈ సమావేశంలో నాయకులు నూనె కొమురయ్య,మాదాసు రామమూర్తి, పర్లపల్లి రవి,జాహెద్ పాషా,పోలాడి శ్రీనివాస్,గండి శ్రీనివాస్,గోపి,రాజ్ కుమార్,సంతోష్ రోడ్డ సంపత్ పాల్గొన్నారు.

# సైబర్ క్రైం పట్ల అవగాహన కలిగి ఉండాలి. ఎస్ ఐ గణేష్

**డోర్ పోస్టర్లు అంటిస్తున్న సైబర్ క్రైమ్ వారియర్ రాజశేఖర్**




ముస్తాబాద్, డిసెంబర్ 30 ( ప్రజా జ్యోతి ): ముస్తాబాద్ మండలంలో జరుగుతున్న సైబర్ క్రైంని నియంత్రించడం కోసం మండల ప్రజలకు అవగాహన కల్పించడం కోసం జిల్లా ఎస్పీ మహేష్ బీ గీతే నేతృత్వంలో పోలీస్ యంత్రాంగం చర్యలు చేపట్టింది.ఇందులో భాగంగా ముస్తాబాద్ మండలంలోని అన్ని గ్రామాల ప్రధాన కూడళ్లతో పాటు,హోటల్స్, ఆసుపత్రులు, షాపింగ్ మాల్స్ వద్ద డోర్ పోస్టర్స్ అంటించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ గణేష్ మండల ప్రజలకు సైబర్ క్రైం పట్ల పలుమార్లు అవగాహన సదస్సులు నిర్వహించడం జరిగింది. అయినప్పటికీ మరింత సమాచారం అప్రమత్తత నిమిత్తం మండలం సైబర్ క్రైం వారియర్స్ అనే ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు. సైబర్ క్రైం వారియర్స్ సైబర్ క్రైమ్ పట్ల అవగాహన కల్పిస్తూ అపరిచిత కాల్స్ అటెండ్ చేయవద్దని, ఆన్లైన్ మోసాలతో జాగ్రత్తగా ఉండాలన్నారు.టెలికం కంపెనీల పేరుతో వచ్చే ఫ్రాడ్ కాల్స్ ని గుర్తించి ఫోన్ లో సంభాషణలు కొనసాగించకూడదు అన్నారు.అపరిచితుల ద్వారా వచ్చే ఫోన్ కాల్స్ కి ఓటిటి నంబర్ చెప్పకూడదు. ఆన్లైన్ లో జాబ్స్ పేరుతో సహితం మోసాలు జరుగుతున్నట్లు గుర్తించలన్నారు. ప్రైజ్ మని గెలిచారని వచ్చే ఫోన్ కాల్స్ ని నమ్మకూడదన్నారు.మండల పరిధిలో ఎక్కడైనా సైబర్ మోసం జరిగిన వెంటనే 1930 కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ క్రైం పట్ల అవేర్ నెస్ డోర్ పోస్టర్స్ అంటిస్తున్న ముస్తాబాద్ పోలీసు స్టేషన్ సైబర్ క్రైమ్ వారియర్ రాజశేఖర్.

# తంగళ్ళపల్లిలో ముక్కోటి వైకుంఠ ఏకాదశి వైభవం



తంగళ్ళపల్లి డిసెంబర్30(ప్రజా జ్యోతి): తంగళ్ళపల్లి మండలంలో ముక్కోటి వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఉదయం నుంచే అభిషేకాలు,అర్చనలు,ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండలంలోని వివిధ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల వద్ద ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని,భజనలు,పూజా కార్యక్రమాలతో తంగళ్ళపల్లి భక్తిమయంగా మారింది.

# డిసెంబర్ 31న డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

**- ముస్తాబాద్ ఎస్ఐ గణేష్**

ముస్తాబాద్, డిసెంబర్ 30 ( ప్రజా జ్యోతి ): నూతన సంవత్సరాన్ని ఆనందోత్సాహాల మధ్య కుటుంబ సభ్యులతో కలిసి సురక్షితంగా జరుపుకోవాలని ముస్తాబాద్ ఎస్ఐ గణేష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.డిసెంబర్ 31న ముస్తాబాద్ పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.అదేవిధంగా డీజేలు, అధిక శబ్దం వచ్చే సౌండ్ బాక్సులు ఏర్పాటు చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నూతన సంవత్సర వేడుకలు శాంతియుతంగా, సురక్షితంగా జరుపుకునేందుకు పోలీస్ శాఖకు సహకరించాలని ప్రజలను ఎస్ఐ గణేష్ కోరారు.



# గొర్రెలు మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ

తిమ్మాపూర్ డిసెంబర్ 30 ( ప్రజాజ్యోతి ): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో మంగళవారం గొర్రెలు,మేకలకు నట్టల నివారణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. మండల సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు మన్నెంపల్లి సర్పంచ్ పొన్నం సునీత అనిల్ గౌడ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఉపసర్పంచ్ కిషోర్, మండల పశువైద్యాధికారి డాక్టర్ మౌనిక, వార్డు సభ్యులు గుంటి రామచంద్రం, పోరండ్ల సబ్ సెంటర్ అధికారి కమలాకర్, గోదెరా కుమార్, పశువైద్య సిబ్బంది, గొర్రెల కాపర్లు కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమం గ్రామంలో పశుసంరక్షణకు మేలు చేసేదిగా మారిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.



# జీవో-252లో సవరణలు చేయాలి

**మంత్రి పొంగులేటికి టీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందం వినతి**



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి ,(ప్రజా జ్యోతి), డిసెంబర్ 30, :జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డులకు సంబంధించిన కొత్త మార్గదర్శకాలతో ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో-252లో కొన్ని సవరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) కోరింది.మంగళవారం టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ నేతృత్వంలో యూనియన్ ప్రతినిధి బృందం సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి జీవో%-%252పై చర్చించి, వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ, ఇటీవల నిర్వహించిన సంఘం ముఖ్యుల సమావేశంలో జీవో%-%252ను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, జర్నలిస్టుల నుంచి వ్యక్తమవుతున్న అభ్యంతరాలు, జీవోలోని లోటుపాట్లపై చర్చించి కొన్ని సవరణలు అవసరమన్న అభిప్రాయానికి వచ్చామని మంత్రికి వివరించారు. గతంలో అక్రెడిటేషన్ కార్డుల విషయంలో డెస్క్ జర్నలిస్టులందరికీ కాకుండా కొందరికే న్యాయం జరిగిందని, ప్రస్తుతం బస్ పాస్‌తో సహా ప్రభుత్వం కల్పించే అన్ని సంక్షేమ పథకాలు రిపోర్టర్లు%-%డెస్క్ జర్నలిస్టుల మధ్య ఎలాంటి వివక్ష లేకుండా అందరికీ వర్తించేలా జీవోను సవరించాలని కోరారు.కేబుల్ టీవీ ఛానళ్లకు సంబంధించి జీవోలో ఉన్న అస్పష్టతను తొలగించాలని, గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో మండలానికి ఒక అక్రెడిటేషన్ కార్డు పరిమితి కాకుండా, ఆయా ప్రాంతాల్లోని ప్రధాన డేట్‌లైన్‌లను గుర్తించి వాటి ప్రకారం కార్డులు జారీ చేసేలా మార్పులు చేయాలని సూచించారు. చిన్న పత్రికలకు సర్క్యులేషన్ ఆధారంగా జిల్లాల స్థాయిలో కూడా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలన్నారు.ప్రధాన పత్రికలు, శాటిలైట్ న్యూస్ ఛానళ్లకు అక్రెడిటేషన్ కార్డుల కుదింపు జరగకుండా చర్యలు తీసుకోవాలని, ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, వీడియో, కెమెరా జర్నలిస్టులకు వారి కార్యాలయాల సిఫారసుల మేరకు కార్డులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలో ఉర్దూ అధికార భాష కావడంతో, ఇతర భాషల సర్క్యులేషన్, గ్రేడింగ్‌లతో పోల్చకుండా, ఉర్దూ పత్రికలు విస్తృతంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక కేటగిరీ కింద జిల్లా, మండల స్థాయిల్లో ఉర్దూ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు జారీ చేసేలా జీవోలో పొందుపర్చాలని కోరారు. అలాగే వెటరన్, ఫ్రీలాన్స్ జర్నలిస్టుల విషయంలో జీవోలో పేర్కొన్న వృత్తి అనుభవ అర్హతలను కొంత సడలిస్తూ సవరణలు చేయాలని అభ్యర్థించారు.టీయూడబ్ల్యూజే వినతిపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ, త్వరలో జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, లోటుపాట్లుంటే సరిదిద్దుతామని హామీ ఇచ్చారు.మంత్రిని కలిసిన ప్రతినిధి బృందంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్లూరి రాములు, రాష్ట్ర కార్యదర్శులు కె. శ్రీకాంత్ రెడ్డి, వి. యాదగిరి, రాష్ట్ర కోశాధికారి యం. వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ. రాజేష్, ఎం.డి. గౌస్, హెచ్‌యూజే అధ్యక్షుడు శంకర్ గౌడ్, రాష్ట్ర చిన్న-మధ్య తరగతి పత్రికల సంఘం అధ్యక్ష%-%ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ బాబు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.టీయూడబ్ల్యూజే సూచనలను పరిశీలిస్తాంజీవో-252పై టీయూడబ్ల్యూజే లిఖితపూర్వకంగా చేసిన సూచనలను పరిశీలిస్తామని రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ ప్రియాంక హామీ ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం జర్నలిస్టు సంఘాలతో సమావేశం నిర్వహించి అభిప్రాయాలు స్వీకరిస్తామని తెలిపారు.

# వీణవంక మండల సర్పంచ్‌ల ఫోరం ఏర్పాటుకు ఏకగ్రీవ సమ్మతి

**అధ్యక్షుడిగా గెల్లు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా జడల శ్రీకాంత్ ఎన్నిక**



**వీణవంక, డిసెంబర్ 30, ( ప్రజాజ్యోతి ):** వీణవంక మండలంలో గ్రామ పాలనను మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగు పడింది. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌ల ఏకగ్రీవ సమ్మతితో వీణవంక మండల సర్పంచ్‌ల ఫోరం నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఫోరం అధ్యక్షుడిగా లస్మక్కపల్లి గ్రామ సర్పంచ్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా హిమ్మత్‌నగర్ గ్రామ సర్పంచ్ జడల శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి మండలంలోని 16 మంది సర్పంచ్‌లు హాజరయ్యారు. గ్రామాల అభివృద్ధి, పంచాయతీలకు సంబంధించిన సమస్యలు, ప్రభుత్వ శాఖలతో సమన్వయం వంటి అంశాలపై చర్చించిన అనంతరం ఫోరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన గెల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న సర్పంచ్‌లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్‌ల ఫోరం గ్రామాల సమస్యలను సమిష్టిగా పరిష్కరించే బలమైన వేదికగా పనిచేస్తుందని అన్నారు. పంచాయతీ బిల్లులు, నిధుల విడుదలలో జాప్యం, అభివృద్ధి పనుల అనుమతులు వంటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు.ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన జడల శ్రీకాంత్ మాట్లాడుతూ, అధ్యక్షుడికి పూర్తి సహకారం అందిస్తూ ఫోరం కార్యకలాపాలను క్రమబద్ధంగా నడిపిస్తానన్నారు. మండలంలోని ప్రతి గ్రామ సర్పంచ్ సమస్య తన సమస్యగా భావించి పనిచేస్తానని స్పష్టం చేశారు.సమావేశంలో పాల్గొన్న సర్పంచ్‌లు, గెల్లు శ్రీనివాస్ నాయకత్వంలో ఫోరం మరింత బలంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఏకగ్రీవ ఎన్నికతో మండలంలో సర్పంచ్‌ల ఐక్యత మరింత బలపడిందని, గ్రామాల అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని తెలిపారు.

# పేదలకు ఆపదలో సీఎం రిలీఫ్ ఫండ్ వరం : అంబటి సురేందర్ రెడ్డి




**వీణవంక, డిసెంబర్ 30, ( ప్రజాజ్యోతి ):** పేద ప్రజలు అనారోగ్యానికి గురైనప్పుడు సీఎం రిలీఫ్ ఫండ్ ఆపద సమయంలో వరంగా నిలుస్తోందని గంగారం గ్రామ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ అంబటి సురేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం గంగారం గ్రామానికి చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అంబటి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ, పేద కుటుంబాలు వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమన్నారు. అర్హులైన ప్రతి పేదవారికి ఈ సహాయం అందేలా కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గూడెపు కోమల్ రెడ్డి, నల్ల ఈశ్వర్ రెడ్డి, అంబటి పుల్లెందర్ రెడ్డి, కాసం రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పుల్లూరి కుమార్, కురుమ యాదవ సంఘం నాయకుడు మెర్గవేన రాజయ్య పాల్గొన్నారు. అలాగే గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు పొన్నాల శ్రీనివాస్, మడికొండ రాజమల్లు, పుల్లూరి పద్మతో పాటు గ్రామ యువకులు గోపు పుల్లారెడ్డి, కిషన్ రెడ్డి, కాసం శ్రీనివాస్ రెడ్డి, గూడెపు బబ్లు, ఆలేటి సాయితేజ రెడ్డి, ఆలేటి బన్నీ, మిరాల వంశీధర్ రెడ్డి, జక్కుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# టీటీయూ జిల్లా అధ్యక్షులుగా కుల్ల రాజేందర్



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి ,(ప్రజా జ్యోతి),డిసెంబర్ 30:** తెలంగాణ టీచర్స్ యూనియన్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులుగా ముత్తారం మండలం పోతారం ప్రాథమిక పాఠశాల పనిచేస్తున్న కుల్ల రాజేందర్ ను నియామకం చేసినట్లు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మునగాల మహిపాల్ రెడ్డి,పొలంపల్లి ఆదర్శన్ రెడ్డి మంగళవారం ప్రకటించారు. ఈ సందర్భంగా కుల్ల రాజేందర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతానని,ప్రభుత్వానికి ఉపాధ్యాయుల గళాన్ని బలంగా వినిపించే విధంగా సంఘాన్ని ముందుకు నడిపిస్తానని తెలిపారు. ఉపాధ్యాయుల హక్కులు,సంక్షేమం, విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం తెలంగాణ టీచర్స్ యూనియన్ కృషి చేస్తుందని ఆయన అన్నారు.అధ్యక్షునిగా తన నియామకానికి సహకరించిన సంఘం నాయకులు, ఉపాధ్యాయులకు కుల్ల రాజేందర్ కృతజ్ఞతలు తెలిపారు. .

# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



**వీణవంక, డిసెంబర్ 30, ( ప్రజాజ్యోతి ):** వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గోనెల కాంతమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం మృతురాలికి గ్రామ నూతన పాలకవర్గం ఘనంగా నివాళులర్పించింది.ఈ సందర్భంగా మృతురాలి కుటుంబానికి నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో రూ. 5,016ల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కుటుంబానికి అండగా నిలుస్తామని పాలకవర్గ సభ్యులు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొలిపాక రజిత-శ్రీనివాస్, ఉపసర్పంచ్ అర్సం శ్రీనివాస్, వార్డు సభ్యులు మోరే వసంత-శ్రీనివాస్, సుజాత-కృష్ణ, నాని యాదవ్, అర్సం రాజయ్య, భవాని కుమారస్వామి, కర్రే కొమురయ్య, మల్లేష్ కారోబార్, మోరే మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యాలకు దూరంగా ఆర్జీ-3 డిసెంబర్ ఉత్పత్తి

**- బొగ్గు ఉత్పత్తి 72 శాతానికే పరిమితం- ఓబి వెలికితీతలో తీవ్ర లోటు**

**- ఓసీపీ-1 వెనుకంజు ఓసీపీ-2 ముందంజ**


**రామగిరి, డిసెంబర్ 30 (ప్రజాజ్యోతి) :** డిసెంబర్ నెలలో రామగుండం-3 ఏరియా బొగ్గు ఉత్పత్తి, ఓబి వెలికితీత లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించడంలో విఫలమైందన్న అంశం తాజా గణాంకాలతో స్పష్టమవుతోంది. మంగళవారం సెంటినరీ కాలనీలోని రామగిరి అతిథి గృహంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రామగుండం-3 ఏరియా, అడ్రియాల ప్రాజెక్ట్ జనరల్ మేనేజర్లు విడుదల చేసిన వివరాలు ఇదే విషయాన్ని బహిర్గతం చేశాయి. రామగుండం-3 ఏరియాకు డిసెంబర్ నెలకు గాను నిర్దేశించిన 6.00 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను కేవలం 4.34 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి కావడంతో 72 శాతం ప్రగతికే పరిమితమైంది. అదే విధంగా 60.50 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబి వెలికితీత లక్ష్యానికి గాను 32.59 లక్షల క్యూబిక్ మీటర్లు మాత్రమే సాధించడంతో 54 శాతం వద్దే ఆగిపోయింది. ఇది గనుల భవిష్యత్ ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావం చూపే అంశంగా మారుతోంది. గనులవారీగా పరిశీలిస్తే, ఓసిపి-1 గనిలో పరిస్థితి మరింత ఆందోళన కలిగిస్తోంది. ఈ గనికి నిర్దేశించిన 3.20 లక్షల టన్నుల లక్ష్యానికి గాను కేవలం 1.27 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి కావడంతో 40 శాతం ప్రగతికే పరిమితమైంది. మరోవైపు ఓసిపి-2 గని మాత్రం 2.80 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 3.07 లక్షల టన్నులు ఉత్పత్తి చేసి 110 శాతం సాధించడం గమనార్హం. అయితే ఒక గని అధికంగా సాధించడం వల్ల మొత్తం ఏరియా లోటు పూడ్చుబడదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఓబి వెలికితీతలో ఓసి-1 గని 126 శాతం, ఓసి-2 గని 101 శాతం సాధించినప్పటికీ, మొత్తం ఏరియా స్థాయిలో మాత్రం లక్ష్యానికి చాలా దూరంగా ఉండటం, ఉత్పత్తి, ఓబి మధ్య సమతుల్యత లేకపోవడం వల్ల రాబోయే నెలల్లో బొగ్గు ఉత్పత్తిపై మరింత ఒత్తిడి పడే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇదే సమయంలో అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్‌లో పరిస్థితి మరింత నిరాశాజనకంగా ఉంది. డిసెంబర్ నెలలో 1.65 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను కేవలం 0.18 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి కావడం ప్రాజెక్ట్ పురోగతిపై తీవ్ర సందేహాలకు దారితీస్తోంది. నూతన ప్యానల్ పనులు ఇంకా పూర్తి కాకపోవడం, సాంకేతిక సమస్యలు, మానవ వనరుల నిర్వహణ వంటి అంశాలు ఇందుకు కారణమా అన్న చర్చ కొనసాగుతోంది. ప్రెస్‌మీట్‌లో అధికారులు భద్రత, క్రమశిక్షణ, గైర్హాజరు తగ్గింపు వంటి అంశాలపై సూచనలు చేశారు. మొత్తంగా డిసెంబర్ నెల గణాంకాలు చూస్తే, కొన్ని గనుల్లో




వ్యక్తిగతంగా సాధించిన విజయాలు ఉన్నప్పటికీ, ఆర్.జి-3 ఏరియా, అడ్రియాల ప్రాజెక్ట్ స్థాయిలో మాత్రం లక్ష్యాలకు దూరంగా ఉన్న పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. రాబోయే నెలల్లో ఈ లోటును ఎలా పూడ్చుతారన్నదే ఇప్పుడు కార్మికులు, ప్రజలు, పరిశ్రమ వర్గాల్లో ప్రధాన చర్చగా మారింది. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ వి.వి.సుధాకర్ రెడ్డి, ఎస్వోటు జీఎం బండి సత్యనారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్లు ప్రవీణ్ వి ఫాంటింగ్, జె.రాజశేఖర్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ జి.శంకర్, ఐఈ డిజిఎం బి.టి.మురళి కృష్ణ, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డిపిఎం వి.సునీల్ ప్రసాద్, సీనియర్ పీఓ పి.రాజేశం తదితరులు పాల్గొన్నారు.ఓసిపి-2 గనిలో నిర్దేశించిన లక్ష్యాన్ని మించి 110 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించడం విశేషమని తెలిపారు. ఓబి వెలికితీతలో ఓసి-1 గని 126 శాతం, ఓసి-2 గని 101 శాతం లక్ష్య సాధనతో ముందంజలో నిలిచినట్లు వివరించారు. ఈ ఫలితాలు అధికారులు, ఉద్యోగుల సమిష్టి కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. గత రెండున్నర సంవత్సరాలుగా రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహించే అవకాశం లభించిందని, ఈ కాలంలో అందరి సహకారంతోనే ప్రగతి సాధ్యమైందని నరేంద్ర సుధాకరరావు పేర్కొంటూ ఉద్యోగులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.**- ఆర్జీ-3 జీఎం నరేంద్ర సుధాకర్ రావు:**అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు మాట్లాడుతూ, డిసెంబర్ నెలలో అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్‌లో ఉత్పత్తి కొనసాగిందని తెలిపారు. నూతన ప్యానల్ పనులు త్వరలో పూర్తి కానున్నాయని, రానున్న రోజుల్లో ఉత్పత్తి మరింత మెరుగుపడే అవకాశాలున్నాయని చెప్పారు. భద్రతను అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని, బాధ్యతాయుతంగా లక్ష్య సాధన దిశగా ఉద్యోగులు ముందుకు సాగాలని సూచించారు.**- అడ్రియాల ప్రాజెక్ట్ జీఎం కొలిపాక నాగేశ్వరరావు**

# మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని కలిసిన నూతన సర్పంచ్

**విజయ నాగరాజు యాదవ్‌కు శాలువాతో సన్మానం**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి,( ప్రజాజ్యోతి ), డిసెంబర్ 30 :** పెద్దపల్లి నియోజకవర్గం, ఓదెల మండలం హరిపురం గ్రామ నూతనంగా ఎన్నికైన సర్పంచ్ విజయ నాగరాజు యాదవ్ మంగళవారం మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి నూతన సర్పంచ్ విజయ నాగరాజు యాదవ్‌ను శాలువాతో సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు ముప్పు రాకేష్, ఉప సర్పంచ్ మహేందర్, వార్డు సభ్యులు దాసరి మహేందర్, అనిత ఓదెల, పద్మ కైలేషన్, రాజయ్యతో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి వైకుంఠంలో ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు

**గోవింద నామస్మరణతో మార్మోగిన శ్రీ వేంకటేశ్వర పుణ్యక్షేత్రం**

**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, ,(ప్రజా జ్యోతి), డిసెంబర్ 30:** శ్రీ వేంకటేశ్వర పుణ్యక్షేత్రం పెద్దపల్లివైకుంఠంలో ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచే వైకుంఠ ద్వార దర్శనం కోసం భక్తులు భక్తి శ్రద్ధలతో బారులు తీరారు. ఆలయ ప్రాంగణమంతా గోవింద నామస్మరణతో మార్మోగింది.భక్తులు స్వామివారికి తులసి దళాలు సమర్పిస్తూ, దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తర ద్వార దర్శనం సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడింది.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సంపత్ కుమార్ చార్యులు మాట్లాడుతూ, వైకుంఠ ద్వార దర్శనం భక్తులకు అత్యంత పవిత్రమైనదని తెలిపారు. వైష్ణవ సంప్రదాయంలో దీనికి విశేష ప్రాధాన్యం ఉందని, వైకుంఠ ద్వారం ద్వారా దర్శనం చేసుకుంటే మోక్షప్రాప్తి కలుగుతుందనే విశ్వాసం భక్తుల్లో ఉందన్నారు. సాధారణంగా వైకుంఠ ఏకాదశి రోజున ఈ దర్శనం నిర్వహించబడుతుందని, ఆ రోజు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని వివరించారు. ఉపవాసంతో, భక్తిశ్రద్ధలతో విష్ణుమూర్తిని దర్శించడం ద్వారా ఆధ్యాత్మిక ఆనందం, మనసుకు శాంతి, జీవనానికి సత్పథం లభిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీ రంగం విజయ్ చార్యులు, ఇతర అర్చకులు, ఆలయ సేవకులు, పోలీస్ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు.



# ప్రమాదాల్లో వికలాంగులైన జర్నలిస్టులకు ప్రత్యేక పెన్షన్లు మంజూరు చేయాలి

**సీఎం ప్రజావాణిలో అధికారులతో చర్చించిన ఎస్సీ-ఎస్టీ జర్నలిస్టుల సంఘం నేతలు**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి,( ప్రజాజ్యోతి), డిసెంబర్ 30 :** ప్రమాదాల్లో గాయపడి వికలాంగులుగా మారిన జర్నలిస్టులకు ప్రత్యేక పెన్షన్లు మంజూరు చేయాలని తెలంగాణ ఎస్సీ%-%ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు హైదరాబాదులోని మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజా భవనంలో మంగళవారం నిర్వహించిన ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల రాజశేఖర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్ కుమార్ సంబంధిత సర్ఫ్ అధికారులతో ఈ అంశంపై ప్రత్యేకంగా చర్చించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వార్తా సేకరణలో భాగంగా విధులు నిర్వహిస్తుండగా ప్రమాదాలకు గురై శాశ్వత వికలాంగులుగా మారిన జర్నలిస్టులు తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కుటుంబ పోషణ కూడా కష్టంగా మారిన పరిస్థితుల్లో, ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి వారికి ప్రత్యేక పెన్షన్లను మంజూరు చేయాలని కోరారు.జర్నలిస్టులు సమాజానికి సమాచారం అందించే కీలక బాధ్యతను నిర్వర్తిస్తున్నారని, అలాంటి వారు ప్రమాదాలకు గురైనప్పుడు ప్రభుత్వ పరిరక్షణ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిపాదనపై స్పందించిన సంబంధిత అధికారులు అంశాన్ని పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# మోట్లపల్లిలో అంటరానితనం నిర్మూలన కార్యక్రమం

## కులం పేరుతో దూషిస్తే చట్టరీత్యా నేరం ఆర్ ఐ నిహారిక

**కాల్వ శ్రీరాంపూర్ డిసెంబర్ 30 (ప్రజా జ్యోతి):** కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మోట్లపల్లి గ్రామంలో మంగళవారం రోజున .అంటరానితనం నిర్మూలన కార్యక్రమాన్ని. అధికారులు నిర్వహించారు.దళిత వాడల్లో పర్యటించి వారి వసతులను పరిశీలించారు%ౌ%దళితులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పలు అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తుల మనోహర్రావు ఉప సర్పంచ్ సుమలత సెక్రటరీ మహేందర్ రెడ్డి వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# రాజ్యాంగంలోని పౌర హక్కులపై అవగాహన కార్యక్రమం

**ముత్తారం డిసెంబర్,30 (ప్రజా జ్యోతి):** మండలంలోని ఓడేడు గ్రామపంచాయతీలోని అంబేద్కర్ కాలనీలో మండల అధికారులు పౌరుల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఆశయాలను, రాజ్యాంగం యొక్క విలువలను, రాజ్యాంగంలో ఉన్న ప్రాథమిక హక్కులను, అంటరానితనం నిషేధంపై అవగాహన కల్పించడం జరిగింది. దీనితోపాటు చదువు యొక్క ప్రాముఖ్యత, ఉద్యోగాలలో ఉన్న రిజర్వేషన్స్ మరియు బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీమతి పోతిపెద్ది కవిత కిషన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజేందర్, ఉప సర్పంచ్ దాసరి ప్రశాంత్, వార్డు సభ్యులు దాసరి దామోదర్, మహమ్మద్ ఖాజా, రత్న రాజేశ్వరి, కారోబార్ ప్రభాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్ మరియు



రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజన్ బాబు, ఏఎస్ఐ సత్తయ్య, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ప్రశాంత్, గ్రామ పోలీసు అధికారి వెంకటరెడ్డి, గ్రామ పాలన అధికారి కుమారస్వామి, సీఆర్పి సమ్మయ్య మరియు అంబేద్కర్ కాలనీ ప్రజలు పాల్గొన్నారు..

# మల్కపేట గ్రామ అత్యవసర సహాయ నిధి ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం

**కొనరావుపేట:డిసెంబర్.30(ప్రజా జ్యోతి):** కొనరావుపేట మండలం మల్కాపేట గ్రామానికి చెందిన లంబ కొమురవ్వ అనారోగ్యంతో మృతి చెందగా గ్రామ ప్రజల సహకారంతో ఏర్పాటు చేసిన గ్రామ అత్యవసర సహాయ నిధి ద్వారా వారి కుటుంబానికి 50 కిలోల బియ్య%శీ% అందజేశారు ఈ సందర్భంగా కష్ట సమయంలో గ్రామస్తులంతా ఒక కుటుంబంల కలిసి బాధితులకు తోడుగా నిలవడమే గ్రామ అత్యవసర సహాయా నిధి ప్రధాన లక్ష్యమని తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోయిని దేవరాజ్ ఉప సర్పంచ్ కట్లే బీరయ్య పాల్గొని,బాధిత కుటుంబానికి మనోధైర్యం కల్పించారు.మల్కపేట గ్రామ అత్యవసర సహాయ నిధికమిటీ అధ్యక్షులు ఎలగందుల హరీష్ ఉపాధ్యక్షులు సాగర్ల నారాయణ కోశాధికారి ఇప్పపూల గణేష్ కార్యదర్శి ఉత్తేం నరేష్ప్రధాన



కార్యదర్శి పాకాల అంజయ్య సలహాదారులు బొల్లారం తిరుపతి,ఆకుల నాగరాజు,సాదుపెల్లి రవి,తంపుల రాజు,తీపిరి లక్ష్మణ్ పాల్గొన్నారు.

# హన్మాజీ పేట్ లో "మోదీ గిఫ్ట్"విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

**వేములవాడ డిసెంబర్, 30: ప్రజాజ్యోతి.** వేములవాడ మండలం లో సోమవారంరోజు హన్మాజీ పేట్ లో విద్యార్థులవిద్యాభివృద్ధిలక్ష్యంగాకేంద్ర మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో"మోదీ గిఫ్ట్"పేరు సైకిళ్ల పంపిణీకార్యక్రమాన్ని ప్రత్యేకంగా ఇట్టి కార్యక్రమం ఎన్నుకొన్నారు. వేములవాడ రూరల్ మండలం హనుమాజీపేట గ్రామంలో 10వ తరగతి విద్యార్థులకుసైకిళ్లపంపిణీచేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ చెన్నమనేని వికాస్ విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని పేద మరియు మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు అండగా నిలవాలన్న లక్ష్యంతోనే కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు.ఎన్నికల సమయంలో మాత్రమే కాదు, ప్రతిరోజూ ప్రజల మధ్య ఉండి, విద్యార్థుల భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి పెట్టే



నాయకుడు బండి సంజయ్ అని వికాస్ రావు ప్రశంసించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు పాఠశాలలకు సులభంగా చేరుకునేందుకు సైకిళు ఎంతోఉపయోగపడతాయని ఆయన అన్నారు.కరీంనగర్ నియోజకవర్గాన్ని విద్యా కేంద్రంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో బండి సంజయ్ చేపడుతున్నఇలాంటికార్యక్రమాలు ప్రజల్లో విశేష ఆదరణ పొందుతున్నాయని తెలిపారు. యువత చదువులో రాణించి సమాజానికి సేవ చేసే స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పరమేష్, జిల్లా ఉప అధ్యక్షులు బంద మల్లేశం, జిల్లా కౌన్సిల్ మెంబర్ జక్కుల తిరుపతి, కిషన్, ప్రిన్సిపల్ శ్రీకాంత్ రావు, హనుమాజీపేట సర్పంచ్ జంకే మధు,బొల్లారం సర్పంచ్ సౌజన్య మల్లికార్జున్, వార్డు సభ్యులు, స్థానిక బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వైభవంగా ముక్కోటి ఏకాదశి



**కొనరావుపేట,:డిసెంబర్.30(ప్రజాజ్యోతి):** వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి అనుబంధ దేవాలయం అయిన మామిడిపల్లి శ్రీసీతారామస్వామి ఆలయ ఆవరణలో ముక్కోటి ఏకాదశి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ఉత్తర ద్వారా రంగు రంగుల పూలతో, పచ్చని తోరణాలతో అలంకరించి అధికారులు ముస్తాబు చేశారు. అర్చకులు తిరునహరి కృష్ణ, రంగనాయకుల శ్రీనివాస్, లక్ష్మణ్ స్వామివారి ఉత్సవవిగ్రహాలను అత్యంత సుందరంగా పట్టు వస్త్రాలతో అలంకరించారు. అనంతరం స్వామివారి ఉత్తరద్వారా వద్ద ఏర్పాటు చేసిన మండపంలో ఆశీనులు చేసి భక్తుల దర్శనం జరిపించారు. గ్రామ సర్పంచ్ పన్నాల లక్ష్మారెడ్డి, విజయ దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి స్వామివారి పల్లకి సేవలో పాల్గొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని ఉత్తర ద్వారం గుండా దర్శించుకుని భజన సంకీర్తనలతో రామనామస్మరణ చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలను అశీర్వచనాన్ని అందుకున్నారు. ఇక అలయ అధికారులు, అర్చకులు నూతన గ్రామపంచాయతీ పాలకవర్గంతో మాజీ సర్పంచ్ కొక్కుల భారత, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాసాల మల్లారెడ్డిలను కండువాతో సన్మానించి, తీర్థ ప్రసాదాలతో పాటు ఆశీర్వచనం అందించారు.

# మృతుని కుటుంబానికి బీజేపీ నేత ఆర్థిక సహాయం

**వీణవంక,డిసెంబర్30,(ప్రజాజ్యోతి ):** వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నిరుపేదస్తుడు మిడిదొడ్డి రాజయ్య వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన మండల బీజేపీ నేత ఉడుత కుమార్ మంగళవారం మృతుని నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను



పరామర్శించారు.ఈ సందర్భంగా మృతికి గల కారణాలను కుటుంబ సభ్యుల ద్వారా తెలుసుకొని ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మృతుని కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయంగా 5,000 అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో మిడిదొడ్డి రవి, కిష్టయ్య, సమ్మయ్యతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# హమాలీ సంఘం ఆధ్వర్యంలో నూతన పాలకవర్గానికి సన్మానం

**కొనరావుపేట: డిసెంబర్.30(ప్రజా జ్యోతి):** కొనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో నూతనంగా ఎన్నికైనా సర్పంచ్ జిన్న అనుష అనిల్ కుమార్ ఉప సర్పంచ్ వాసం పెల్లి శ్రీనివాస్ లను హమాలీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం సభ్యులు పరిశరములు రమేష్ బాబు రాములు ఆనందం కాశీరామ్ శ్రీనివాస్ రాజు స్వామి చందు మల్లికార్జున్ రాజు శ్రీనివాస్ లు ఉన్నారు.



# సమన్వయంతో సౌకర్యాలు కల్పించాలి

### మహా శివరాత్రి జాతర సమన్వయ సమావేశంలో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జాతర చైర్ పర్సన్ ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

### వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి డిసెంబర్ 30 (ప్రజా జ్యోతి ):** మహా శివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమెల్యే ఆది శ్రీనివాస్, జాతర చైర్ పర్సన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14, 15, 16 తేదీల్లో మహా శివరాత్రి జాతర నిర్వహించనున్న నేపథ్యంలో వేములవాడ లోని భీమేశ్వర సదన్ ఆవరణలో వివిధ శాఖల అధికారులతో జాతర సమన్వయ సమావేశాన్ని మంగళవారం జాతర చైర్మన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధ్యక్షతన నిర్వహించగా, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమెల్యే ఆది శ్రీనివాస్, ఎస్పీ మహేష్ బీ గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమెల్యే ఆది శ్రీనివాస్, జాతర చైర్మన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. భక్తులు భీమేశ్వర ఆలయంలో స్వామి వారి దర్శనాన్ని వేగంగా, సౌకర్యంగా చేసుకునేలా ఏర్పాట్లు ముమ్మరంగా చేయాలని వివరించారు. వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ నుంచి శ్రీ ఆలయం దాకా, వేములవాడ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే రోడ్లలో మరమ్మత్తులు, నిర్మాణాలు పక్కా ప్రణాళిక పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బస్ లు సిద్ధం చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. తిప్పాపూర్ ఆర్ టీ సీ బస్ స్టాండ్ లో తాగు నీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి దానికి ఒక అధికారిని నియమించాలని ఆదేశించారు. పారిశుధ్య పనుల నిర్వహణ వేములవాడ మున్సిపల్, జిల్లా పంచాయతి అధికారి సంయుక్తంగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, ఎక్కడా ఇబ్బంది రాకూడదని స్పష్టం చేశారు. హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలని, ప్రతి చోట అన్ని వివరాలతో కూడిన సైన్ బోర్డులు పెట్టించాలని, అందరి ఫోన్ నంబర్ లు ఉండాలని తెలిపారు. ఈ కేంద్రాల్లోని వారికి ఆలయానికి సంబందించిన పూర్తి సమాచారం ఉండాలని ఆదేశించారు. జాతర విధుల్లో పాల్గొనే అన్ని శాఖల అధికారులు వారి సమగ్ర యాక్షన్ ప్లాన్ తో రావాలని తెలిపారు. ఆలయం లోని క్యూల వద్ద, పార్కింగ్ స్థలాల వద్ద తాగు నీటి, మజ్జిగ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. భక్తులకు అల్పాహారం ఉప్మా, పులిహోర, పెరుగు అన్నం, నీటి వసతి చక్కటి వాతావరణంలో కల్పించాలని సూచించారు. ప్రతి జాతర ప్రదేశాల్లో నాణ్యమైన తాగునీటిని అందుబాటులో పెట్టాలని ఆర్ డబ్ల్యుఎస్, మిషన్ భగీరథ అధికారులని ఆదేశించారు. మరో సమావేశం నిర్వహిస్తామని, అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో రావాలని ఆదేశించారు. ఆలయ ఆవరణలో 24 గంటలపాటు వైద్య బృందం, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, ఫైర్ సేఫ్టీ అధికారులు ఆలయంలో పరిశీలించి, కావాల్సిన పరికరాలు వివరాలు అందజేయాలని సూచించారు. జాతర ఆవరణలో ప్లాస్టిక్ వస్తువులు వినియోగించకుండా చూడాలని, సమ్మక్క సారాలమ్మ జాతర నేపథ్యంలో బక్తుల కోసం వైద్య బృందం అందుబాటులో ఉండాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులకు సహాయం కోసం వీల్ చైర్లు వాలంటీరను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి చోట సైన్ బోర్డ్ లు ఉండాలని పేర్కొన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆహార పదార్థాలను తనిఖీ చేయాలని సూచించారు. ప్రతి శాఖ అధికారి తమ పూర్తి యాక్షన్ ప్లాన్ తో రావాలని తెలిపారు. దర్శనం, వెహికల్ ఇతర పాస్ లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ చేస్తామని విప్, ఇంచార్జి కలెక్టర్ స్పష్టం చేశారు. మహా శివరాత్రి సందర్భంగా ట్రాఫిక్ కు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని ఎస్పీ మహేష్ బీ గితే తెలిపారు. సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతరకు వచ్చే వీఐపీల దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని వివరించారు. వేములవాడ లో కావాల్సిన సైన్ బోర్డ్, సి సి కెమెరాలు ఉంచాలని సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా వాలంటీర్ లను తమకు అప్పగించాలని వివరించారు. సమావేశంలో ఏఎస్పీ రుత్విక్ సాయి, ఆర్డీఓ రాధాబాయి, ఆలయ ఈఓ రమాదేవి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు ఉన్నారు.



# ఓడిన ఇచ్చిన మాట నెరవేర్చిన రోమాల ప్రవీణ్ కుమార్



**వేములవాడ డిసెంబర్, 30: ప్రజాజ్యోతి:** వేములవాడ రూరల్, మండలం నూకలమర్రి గ్రామంలో రోమాల లక్ష్మణ్ ఫౌండేషన్ చైర్మన్ రోమాల ప్రవీణ్ కుమార్ తన మాటను నిలబెట్టుకున్నారు. ఈ సందర్భంగా నూకలమర్రి గ్రామంలోని ఏసుక్రీస్తు శిశు మందిరం (చర్చ్) కు రూ.15,000 విలువైన ప్లంబింగ్ సామాను, నీటి ట్యాంకును అందజేశారు. ఈ కార్యక్రమం రోమాల ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. గ్రామ అభివృద్ధి, మతసామరస్యం కోసం ఇటువంటి సేవా కార్యక్రమాలు అభినందనీయమని పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ రూరల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వకుళాభరణం శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ బొడ్డు రాములు %-% శంకరవ్వ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాలకుర్తి పరుశ రాములు, చర్చ్ పాస్టర్ జాన్, ఉప సర్పంచ్ పాలకుర్తి శంకరయ్య, వార్డ్ మెంబర్లు పొత్తూరి గాంధీ, భాగ్య, రాజు నాయక్, రణధీర్ సాహితీ, రోమాల సురేష్, సుల్తాన్ పరుశురాములు, సీనియర్ నాయకులు సమల్ల రాజు, రోమాల తిరుపతి, కాశరం, మేడుదల పరుశురాం, భారత్ చర్చ్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.

# విద్యార్థులను అభినందించిన సుడా చైర్మెన్



**రామడుగు, డిసెంబర్ 30(ప్రజా జ్యోతి):** కరీంనగర్ కళాభారతి లో నిర్వహిస్తున్నటువంటి మిలీనియం శ్రీను డాన్స్ అకాడమీ 25 వ వార్షికోత్సవ వేడుకల్లో రామడుగు మండలం గోపాలరావుపేట శ్రీ ప్రగతి విద్యార్థులు క్లాసికల్, ఫోక్ డాన్స్ లలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచినందుకుగాను సుడా చైర్మన్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి విద్యార్థులకు బహుమతులను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డాన్స్ మాస్టర్ అజయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గోవిందరాజుల స్వామివారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్



**వేములవాడ డిసెంబర్, 30: ప్రజాజ్యోతి.** చందుర్తి మండలం సనుగుల గ్రామంలోని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత గోవిందరాజుల స్వామి వారిని ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కుటుంబసభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రభుత్వ విప్ కు ఘనస్వాగతం పలికారు.. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. గోవింద రాజుల స్వామి వారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు పాడిపంటలతో సంతోషంగా ఉండాలని వేడుకున్నారు.

# కలియుగ వైకుంఠపురానికి పోటెత్తిన భక్తులు

**కథలాపూర్, డిసెంబర్ 30(ప్రజాజ్యోతి):** వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండలంలోని దేవాలయాలన్నీ భక్తుల గోవిందా.. గోవింద నామస్మరణతో మార్మోగాయి. ఆలయాల్లో మూల విరాట్టుకు అర్చకులు ఏకాంతంగా



కైంకర్యాలను నిర్వహించి ప్రత్యేక పూజాది కార్యక్రమాల అనంతరం వైకుంఠ ద్వారాలను అర్చకులు తెరిచారు. వేకువజామునుంచే వైకుంఠ ద్వారాలు తెరుచుకోవడంతో దేవాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. కథలాపూర్ మండలం దుంపేట శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయంలో స్వామి వారు ఉత్తరద్వారం గుండా భక్తులకు దర్శనమిచ్చారు. తాండ్రియాలలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఉత్తర ద్వారం దర్శనం ప్రత్యేకం. గరుడ వాహనంపై గ్రామంలో ప్రధాన వీధుల గుండా స్వామి వారి ఊరేగింపు కన్నులపండువగా నిర్వహించారు. గంభీర్పూర్, పెగ్గెర్ల, తకళ్ళపెల్లిలో ప్రత్యేకంగా ఉత్తరద్వారాన్ని ఏర్పాటు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కథలాపూర్ మండల కేంద్రంలో ఉత్తర ద్వార దర్శనం ఇచ్చిన లక్ష్మీ వెంకటేశ్వరస్వామి వారిని చూడటానికి భారీగా భక్త జనం తరలి వచ్చారు. వేడుకల్లో నూతన సర్పంచులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. మండల వ్యాప్తంగా ఆలయాలు 'ఓం నమో నారాయణాయ' నామస్మరణలతో మారుమోగాయి.

# సమతుల్య ఆహారం ద్వారా డయాబేటిస్ ను నియత్రించవచ్చు

## మధుమేహం, రక్తపోటుపై అవగాహన అవసరం-విలేకరుల సమావేశం లో వైద్యులు




**కరీంనగర్ టౌన్, డిసెంబర్ 30( ప్రజాజ్యోతి):** మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల వల్ల డయాబెటిస్ (మధుమేహం), హైపర్ టెన్షన్ (అధిక రక్తపోటు) వంటి వ్యాధులు సమాజానికి పెను సవాలుగా మారుతున్నాయని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ఐఎంఏ హాల్‌లో మంగళవారం డాక్టర్ బి.ఎన్. రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ డయాబెటిస్ హైపర్ టెన్షన్ దినోత్సవాలను పురస్కరించుకుని మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులు బి ఎన్ రావు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బి ఎన్ రావు, జిల్లా ఐ ఎం ఏ అధ్యక్షురాలు డాక్టర్ ఆకుల శైలజ లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ బి ఎన్ రావు మాట్లాడుతూ డయాబేటిస్, హైపర్ టెన్షన్ అనేవి కవలలని రెండింటిని తొలి దశలో గుర్తించాలన్నారు. బి ఎన్ రావు ఫౌండేషన్ ద్వారామొదటగా బోయినపల్లి, మానకొండూర్, కొత్తపల్లి లను పైలట్ ప్రాజెక్ట్ గా తీసుకొని ప్రతినెల మొదటి, రెండవ వారంలో రక్త పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పాల్గొన్న ముఖ్య వక్తలు డయాబెటిస్, హైపర్ టెన్షన్ నియంత్రణపై పలు కీలక సూచనలు చేశారు. డయాబెటిస్, హైపర్ టెన్షన్‌లను 'నిశ్శబ్ద హంతకులు' అని, ఇవి శరీరంలోని కిడ్నీలు, గుండె, కళ్లపై తీవ్ర ప్రభావం చూపుతాయని హెచ్చరించారు. ప్రతిరోజూ కనీసం 30-40 నిమిషాల వ్యాయామం, సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా ఈ వ్యాధులను నియంత్రించవచ్చని తెలిపారు. ఒత్తిడి తగ్గించుకోవడం, తగినంత నిద్ర పోవడం రక్తపోటును అదుపులో ఉంచడానికి సహాయపడతాయని వివరించారు.30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఏటా కనీసం ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.బి ఎన్ రావు ఫౌండేషన్ ద్వారా ఫ్రీ హెల్త్ క్యాంపు లు నిర్వహించడం హర్షనీయమన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తరపున సహకరిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో మాజీ ఐ ఎం ఏ అధ్యక్షుడు డాక్టర్ ఎనమళ్ళ నరేష్, డాక్టర్ లు తిరుపతి రావు, విజయమోహన్ రెడ్డి, జాన్సీ, నీలిమ, రాజకుమార్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# అంజన్న సన్నిధికి జనసేనాని

## - పర్యాటన ఖరారు.... స్థల పరిశీలనలో అధికారులు -టీటీడీ నిధులతో ఆలయ అభివృద్ధికి శంకుస్థాపన

### - ఉత్కంఠ రేపుతున్న పాసుల చర్చ





**మల్యాల,డిసెంబర్ 31,ప్రజా జ్యోతి :** కొండగట్టు అంజన్న సన్నిధానానికి జనసేనని ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాకను అధికారులు అధికారింగా ఖరారు చేశారు. జనవరి 3వ తేదీన ఆయన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకోనున్నట్లు అధికారికంగా వెల్లడైంది. షెడ్యూల్ ప్రకారం జనవరి 3న ఉదయం హైదరాబాద్ బేగంపేట్ ఎయిర్పోర్ట్ నుండి 9.25 కు హెలికాప్టర్ ద్వారా బయలుదేరి కొండగట్టు జేఎన్టీయూ హెలిపాడ్‌కు 10.25 గంటలకు పవన్ కళ్యాణ్ చేరుకుంటారు. 10.30గంటలకు కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పవన్ కళ్యాణ్ రాక ఖరారు కావడంతో అధికారులు కొండగట్టు పరిసర ప్రాంతాలను పరిశీలించారు.- **టీటీడీ నిధులతో కొండగట్టు ఆలయ అభివృద్ధికి శంకుస్థాపన** టీటీడీ కొండగట్టు ఆలయ అభివృద్ధి కోసం నిధులు కేటాయించిన విషయం అందరికీ విరితమే. ఇందులో భాగంగా టీటీడీ సహకారంతో కొండగట్టులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం 11.30 గంటలకు కొడిమ్యాల మండలంలోని నాచుపల్లి గ్రామంలో ఉన్న ఓ రిసార్ట్‌లో నిర్వహించే ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమం పూర్తయ్యాక తిరిగి జేఎన్టీయూ హెలిపాడ్ నుంచి మధ్యాహ్నం 1గంటకు హెలికాప్టర్ ద్వారా తిరిగి హైదరాబాద్‌కు వెళ్లనున్నారు.- **ఉత్కంఠ రేపుతున్న పాసుల చర్చ** :ప్రముఖ సినీ నటుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కొండగట్టు రాక ఖరారు అవ్వడంతో తన అభిమానులలో పాస్ ల చర్చ ఉత్కంఠ రేపుతోంది. తమ అభిమాన నటుడు తమకు సమీపముగా వస్తున్న తరుణంలో తనను చూడాలన్న ఆలోచనతో కొండగట్టుకు వెళ్లాలన్న అభిమానులకు అనుమతిని ఇస్తారా. లేదా పాస్ లు ఇస్తారా. అన్న చర్చ స్థానికంగా జోరుగా సాగుతుంది. ఇది ఇలా ఉంటే వార్త కవరేజ్ కోసం వస్తున్న జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్, ఎలక్ట్రానిక్ మీడియా నియోజకవర్గ రిపోర్టర్స్, మండల స్థాయి రిపోర్టర్స్ కు మీడియా పాస్ లు కేటాయిస్తారా లేదా అనేది వేచి చూడాల్సి ఉంది. పవన్ కళ్యాణ్ రాకతో ఇటు యంత్రాంగము, పలు శాఖల అధికారులు, మీడియా ప్రతినిధులు హాజరవుతూ.....అటు అంజన్న భక్తులు, పవన్ కళ్యాణ్ అభిమానులు, జనసేన నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో కొండగట్టుకు రానున్నట్లు సమాచారం. పవన్ కళ్యాణ్ రాకతో జనవరి 3వ తేదీన ప్రజల రద్దీ, ట్రాఫిక్ నియంత్రణ విషయంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించగా ఆలయ అధికారులు, పోలీస్ శాఖ సమన్వయంతో నియంత్రణించనున్నట్లు సమాచారం . పవన్ కళ్యాణ్ కొండగట్టు పర్యటనకు హాజరుకానున్న ప్రజా ప్రతినిధులకు,మీడియా ప్రతినిధులకు,నాయకులకు, అభిమానులకు ఎవరికి ఎలాంటి పాస్ లు కేటాయించనున్నారన్న విషయం వేచి చూడాల్సి ఉంది.

# ఓసీలు ఐకమత్యంతో ఉంటేనే హక్కులు సాధ్యం

## ఓసి సామాజిక సంఘాల సమైక్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు



**కాల్వ శ్రీరాంపూర్ డిసెంబర్ 30 (ప్రజా జ్యోతి):** ఓసీలు ఐక్యమత్యంతో ఉండి తమ హక్కులను సాధించుకోవాలని ఓసి సామాజిక సంక్షేమసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు సూచించారు కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో మంగళవారం రోజున ఓసీలతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. జనవరి 11న హన్మకొండ పట్టణంలో లక్ష మందితో ఓసీల సింహగర్జన కార్యక్రమాన్ని సైన్స్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు ఈ సింహగర్జన కార్యక్రమానికి ఓసీలు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు అనంతరం గోడ ప్రతులను ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర అర్చక సంఘం అధ్యక్షులు నిట్టూరి సతీష్ శర్మ మా జి జెడ్పిటిసి వం గల తిరుపతిరెడ్డి నాయకులు యాంసాని రాఘవులు పెద్దిరెడ్డి వీరారెడ్డి సుధాటి కరుణాకర్ రావు కాల్వ రాధాకృష్ణారెడ్డి కోలేటి అశోక్ వడ్లూరి రాజేశ్వరరావు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నూతనంగా వేస్తున్న మట్టి రోడ్డును పరిశీలించిన

## మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్



**కాల్వ శ్రీరాంపూర్ డిసెంబర్ 30 (ప్రజా జ్యోతి):** కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మీర్జంపేట్ సమ్మక్క సారలమ్మకు వెళ్లే దారిని మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ మంగళవారం రోజున పరిశీలించారు. ఈయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజన వేణ సదయ్య. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి. మాజీ ఎంపీటీసీ మొగిలి సదానందం. సర్పంచ్ శైలజ సదానందం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# దొంగల ముఠాను అరెస్టు చేసిన మేడిపల్లి ఎస్ ఐ శ్రీధర్ రెడ్డి




**మేడిపల్లి డిసెంబర్ 30 (ప్రజాజ్యోతి):** మండల కేంద్రంలోని బుధవారం అర్ధరాత్రి మహాలక్ష్మి మొబైల్ షాప్ లో 9 సెల్ ఫోన్లు, శనివారం రోజున అర్ధరాత్రి కోరుట్ల పట్టణంలోని హాజీపూర్ లో ఒక మోటార్ సైకిల్ దొంగతనం చేసిన నలుగురు వ్యక్తులు పడాల దినేష్ పొలాస, అర్షద్ ఖాన్ కోరుట్ల, పిట్టల అరవింద్ చందుర్తి,జగదీశ్వర్ నిజామాబాద్ లను బుధవారం మేడిపల్లి గ్రామ శివారులో పట్టుకొని నిందితుల నుంచి 9 కొత్త సెల్ ఫోన్లు, రెండు మోటార్ సైకిల్లు స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలించారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుల్స్ పురుషోత్తం, నాగరాజులను మేడిపల్లి ఎస్సై శ్రీధర్ రెడ్డి, కోరుట్ల సీఐ సురేష్ బాబు మెట్పల్లి డిఎస్పి రాములు గార్లు అభినందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నిందితులను గుర్తించడంలో సీసీటీవీ కెమెరాలు కూడా ఎంతో ఉపయోగపడ్డాయని, అందుకే ప్రతి ఒక్కరు సిసిటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజల్ని కోరారు.

# శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

**బీర్ పూర్, డిసెంబర్ 30 (ప్రజా జ్యోతి):** జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండల కేంద్రంలోని అతి పురాతనమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి (వైకుంఠ ఏకాదశి) వేడుకలు మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుండే భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. **ఉత్తర ద్వార దర్శనం:** ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారు భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా దర్శనమిచ్చారు. "గోవింద నామస్మరణ"తో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఉత్తర ద్వారం గుండా స్వామిని దర్శించుకుంటే మోక్షం సిద్ధిస్తుందనే నమ్మకంతో భక్తులు వేచి ఉండి మొక్కులు తీర్చుకున్నారు. **ప్రత్యేక అలంకరణ:** ఉత్సవమూర్తులను రకరకాల పుష్పాలతో, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ



సభ్యులు సౌకర్యాలను ఏర్పాటు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

# నారక్కపేట సర్పంచ్ సంపత్‌కు వీవోఏ ల ఘన సన్మానం

### వీవో అధ్యక్షులు పొన్నం వెంకటేశ్వర్లు


**నల్లబెల్లి, డిసెంబరు 30( ప్రజా జ్యోతి):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా నూతనంగా ఎన్నికైన వీ వో ఏ సంపత్‌ను మంగళవారం మండల వీ వో ఏ ల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బిఆర్ఎస్ మద్దతుతో భారీ మెజారిటీతో విజయం సాధించిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వీ వో అధ్యక్షులు పొన్నం వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఏపీఎం సుధాకర్, వరంగల్ జిల్లా వీ వో ఏ అధ్యక్షులు పోలుదాసరి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. తోటి కార్యకర్త ఉన్నత స్థాయికి ఎదగడం గర్వకారణమని, నారక్కపేట గ్రామ అభివృద్ధికి సంపత్ శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వీ వో ఏ ల సంఘం కార్యదర్శి ఇప్ప మమత, కోశాధికారి గాదం మైపాల్‌తో పాటు



రవీందర్, రవికుమార్, అరుణ, అనసూయ, మంజుల తదితరులు పాల్గొని నూతన సర్పంచ్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# వైకుంఠ ఏకాదశి వేడుకల్లో పాల్గొన్న ఈగ మల్లేశం

### భక్తుల నీటి అవసరాల కోసం ఆలయానికి బోరు మోటార్ విరాళం



**వర్ధన్నపేట డిసెంబర్ 30, ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా, వర్ధన్నపేట మండలకేంద్రంలో ఉన్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తుల నీటి అవసరాలను తీర్చేందుకు తమ సొంత ఖర్చులతో బోరు మోటార్‌ను కొనుగోలు చేసి ఆలయానికి విరాళంగా అందజేశారు. శ్రీ సీతారామచంద్ర స్వామి వారి సేవలో భాగస్వామి కావడం ఎంతో సంతోషంగా ఉందని ఈగ మల్లేశం ఈ సందర్భంగా తెలిపారు. ఈగ మల్లేశం సేవా భావాన్ని వర్ధన్నపేట పట్టణ ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో తుమ్మల యాకయ్య, కొండేటి సత్యం, సమ్మెట శ్రీనివాస్, తుమ్మల రవీందర్, సమ్మెట రాంబాబు, మార్త సారంగపాణి, కరిమిల్ల సంపత్ రావు, పెద్దూరి రాజ్ కుమార్, యుగంధర్, సమ్మెట సుధీర్, చెన్న శ్రీధర్, గుజ్జ సోమేశ్వర రావు, కేదారి, మల్లెపాక అనిల్, ఆరెల్లి నాగార్జున, దొమ్మటి భాను చందర్, వడ్లకొండ రవీందర్, ఆలయ అర్చకులు కలకోట గోపాల చారి, రమణా చారి తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల ఆశయాలను గౌరవిస్తూ ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి: సీఐ శ్రీనివాస్

**చెన్నారావుపేటడిసెంబర్ 30 ( ప్రజా జ్యోతి):** చెన్నారావుపేట మండల పరిధిలోని కోనాపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన 'జాగృతి' పోలీస్ కళాబృందం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. సమాజంలోని రుగ్మతలపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు నెక్కొండ సిఐ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ ప్రసంగిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు..ప్రతి యువకుడు/యువతి తమ తల్లిదండ్రులు నేర్పిన మంచి పద్ధతులను అలవర్చుకోవాలని, క్రమశిక్షణతోనే సమాజంలో గౌరవం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం యువత ఎక్కువగా సైబర్ నేరగాళ్ల బారిన పడుతున్నారని

# 100 పడకల ఆసుపత్రిపై కుట్ర

### ఎంఎంసి చైర్మన్ నరుకుడు వెంకటయ్య ఆరోపణ

**వర్ధన్నపేట, డిసెంబర్ 29 (ప్రజా జ్యోతి):** వరంగల్ జిల్లా, వర్ధన్నపేట



మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య మాట్లాడుతూ, వర్ధన్నపేట నియోజకవర్గానికి మంజూరైన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిపై కొందరు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న అరూరి రమేష్ వర్ధన్నపేటకు 100 పడకల ఆసుపత్రి మంజూరు చేస్తానని పలు సభల్లో హామీలు ఇచ్చారని, అయితే ఆ హామీలు అమలుకు నోచుకోలేదని తెలిపారు. ఆ ప్రభుత్వం ఆసుపత్రిని మంజూరు చేయకుండా మాటలకే పరిమితమైందని విమర్శించారు. ప్రస్తుత ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మంత్రులు దనసరి సీతక్క, కొండ సురేఖల సహకారంతో వర్ధన్నపేట నియోజకవర్గానికి రూ.200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌తో పాటు 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని మంజూరు చేయించారని తెలిపారు. మూడు మండలాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మండలంలోని కట్రియాల గ్రామ రెవెన్యూ పరిధిలో, ఉప్పరపల్లి వెళ్లే దారిలోని ప్రభుత్వ భూమిలో ఇటీవల జిల్లా కలెక్టర్‌తో కలిసి ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారని చెప్పారు. అయితే దళితుడైన ఎమ్మెల్యే నాగరాజుకు ప్రజల్లో మంచి పేరు వస్తుందనే ఉద్దేశంతో కొందరు అగ్ర వర్ణాల నాయకులు కుట్ర పూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారని నరుకుడు వెంకటయ్య ఆరోపించారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో ఆసుపత్రికి అనువైన స్థలం లేనప్పటికీ, యువతను మరియు అన్ని పార్టీల నాయకులను రెచ్చగొడుతూ ఆసుపత్రిని వర్ధన్నపేట కేంద్రానికి తరలించాలని ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. నాలుగు దశాబ్దాలుగా అగ్ర వర్ణాల పాలనలో వర్ధన్నపేటలో గణనీయమైన అభివృద్ధి జరగలేదని, అయితే గత రెండు సంవత్సరాలుగా ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు ప్రజల ఆశీర్వాదంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. ఈ అభివృద్ధిని అడ్డుకునేందుకే దుష్ప్రచారాలకు తెరలేపుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా భేషజాలకు పోకుండా, ఇప్పటికే భూమిపూజ జరిగిన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి అందరూ సహకరించాలని, ముఖ్యంగా అగ్ర వర్ణాలు మరియు పెత్తందారులు ఎమ్మెల్యే నాగరాజుకు మద్దతుగా నిలవాలని నరుకుడు వెంకటయ్య కోరారు.

# గ్రామాభివృద్ధే లక్ష్యంగా అధికారులను కలిసిన నూతన సర్పంచ్

**రఘునాథపల్లి, డిసెంబర్ 30( ప్రజాజ్యోతి):** రఘునాథపల్లి మండలంలోని కోడూరు గ్రామానికి నూతనంగా ఎన్నికైన సర్పంచ్ గోడిశాల లలిత%-%సోమయ్య గ్రామాభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా చేసుకుని ఉపసర్పంచ్, వార్డు సభ్యులతో కలిసి ఎంపీడీవో శ్రీనివాసులు , తహసీల్దార్ ఫణికిషోర్ , ఎస్ఐ నరేష్ యాదవ్ లను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న తాగునీరు, రోడ్లు, పారిశుద్ధ్యం తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని కోరుతూ, తమ గ్రామానికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి అధికారులు సానుకూలంగా స్పందించారని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చాగంటి యాదగిరి, వార్డు సభ్యులు దాసరి లక్ష్మి, భాషపాక మధు, దుబ్బాక స్వాతి%-%అజిత్, గౌడ వీరేష్, చిట్యాల స్వామి, టీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గోరిగే అంజయ్య , గోడిశాల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

